




మూడు కూపన్లు..
ఆరు ట్రాక్టర్లు

- గోదావరి, కిన్నెరసాని కేంద్రంగా ఇసుక దందా
- అభివృద్ధి మాటున అక్రమార్కుల చేతివాటం
- బూర్గంపాడు మండలంలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- ఉదాసీనంగా వ్యవహరిస్తున్న కొందరు అధికారులు
- కొందరికి ట్రాక్టరుకు నెలకు రూ.10వేల మామూళ్లు

7

భద్రాద్రి ఘటన
దురదృష్టకరం
దేవస్థానం ఉద్యోగుల సంక్షేమ సంఘం

భద్రాచలం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సీతారామచంద్రస్వామి ఆలయంలో శేష వస్త్రాల విక్రయ కౌంటర్‌లో జరిగిన ఘటన దురదృష్టకరమంటూ దేవస్థానం ఉద్యోగుల సంక్షేమ సంఘం మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఆ ఘటన ఉద్దేశ్యపూరకంగా జరగలేదని, స్క్రాప్ కవర్లు కొనుగోలు చేసిన సమయంలో జరిగిన తప్పిదమని కాంట్రాక్టర్ వివరణ ఇచ్చినట్లు తెలిపారు. దేవస్థానం ఉద్యోగులు, రామ భక్తులు కూడా విచారిస్తున్న సమయంలో సున్నితమైన ఈ అంశాన్ని మరింత ప్రచారం చేయడం భావ్యం కాదన్నారు. భవిష్యత్‌లో ఇటువంటి పొరపాట్లు జరగకుండా చూస్తామని ఈ సందర్భంగా లేఖలో తెలియజేశారు.


సర్వే పరికరాల గురించి తెలుసుకుంటున్న మంత్రులు

రైతు సంక్షేమం కోసమే..
భూ భారతి

- కొత్త చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం
- ధరణి పేరుతో గత ప్రభుత్వం భూములను ఆగంచేసింది
- కొత్త సర్వేతో భూ రికార్డులు పటిష్ఠం
- డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి
- 'పైలెట్' గ్రామం ములుగుమాడులో భూ సర్వే, రెవెన్యూ సదస్సులకు శ్రీకారం

ఖమ్మం, జూన్ 3 (ఆంధ్రజ్యోతిప్రతినిధి)/ఎర్రుపాలెం : రైతు సంక్షేమం కోసమే తమ ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తెచ్చిందని, ఈ చట్టంతో సుదీర్ఘ కాలంగా ఎదుర్కొంటున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం దక్కబోతోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. భూ భారతి చట్టం పెలెట్ గ్రామంగా ఎంపికైన ఎర్రుపాలెం మండలంలోని ములుగుమాడు గ్రామంలో మంగళవారం వారు భూసమగ్ర సర్వే , రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ రైతు, ప్రజా ప్రభుత్వంలో భూ రికార్డులు, మ్యాపులు సర్వహక్కులు రైతులకు పకడ్బందీగా అందించేందుకు కృషిచేస్తున్నామని, గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణిపేరుతో రైతుల భూములను ఆగం చేసిందని, వేల ఎకరాలు మింగేసిందని, రైతులు, ప్రజలను అనేక విధాలుగా ఇబ్బందులకు గురిచేసిందని ఆరోపించారు. అందుకే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ధరణిని బంగాళాఖాతంలో కలిపి కొత్తగా భూ భారతి చట్టాన్ని తెచ్చామని గుర్తుచేశారు. ఈ రెవెన్యూ సదస్సుల్లో వచ్చే దరఖాస్తులను ఆగస్టు 15నాటికి పరిష్కారం చేసి చూపి.. దేశానికే ఆదర్శంగా నిలబోతున్నామన్నారు. ఈ ప్రక్రియలో ప్రజలు, అధికారులు భాగస్వామ్యమై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.


ములుగుమాడు సదస్సుకు హాజరైన రైతులు

భూ భద్రతకు కొత్తచట్టం : భట్టి విక్రమార్క



భూ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించి.. భద్రత కల్పించేందుకు కొత్తచట్టాన్ని తీసుకొచ్చామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క వివరించారు. గతంలోనూ రైతుల భూ సమస్యలను పరిష్కరించిన ఘనత కాంగ్రెస్‌దేనని.. రైతులకు, అసైన్డుభూములలో సాగులో ఉన్న పేదలకు పట్టాలిచ్చిన ఇచ్చిన చరిత్ర తమదేనన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పేరుతో దగాచేసిందని, ఎన్నో భూములు మాయమయ్యాయని, ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారన్నారు. తప్పులు, ఇబ్బందులుంటే పిర్యాదులు చేసే అవకాశం కూడా ఇవ్వకుండా కోర్టుల కెళ్లేలా చట్టం తెచ్చి రైతులను, ప్రజలను కష్టపెట్టారని, భూహక్కులను కాలరాసిందని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ నాయకులు వారి మనుషులకు మాత్రమే భూములను కట్టబెట్టి తిరిగి సవరించే అధికారం, అవకాశం లేకుండా ధరణిని రూపొందించారని ఆరోపించారు. 10ఎకరాలు ఉంటే 17ఎకరాలకు పాస్‌పుస్తకాలు జారీ చేశారని, భూములు (మిగతా 6వ పేజీలో)

హలో.. కమిషనర్!

నగరపాలకంలో సమస్యలపై రేపు ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్



మీ ప్రాంతంలో చెత్త సేకరణ సరిగ్గా జరగడం లేదా? డ్రెయినేజీలు పొంగి పొర్లుతున్నాయా? వాటి పూడిక తీయడం లేదా? వీధి దీపాలు వెలగడం లేదా? ఇంటి నెంబర్లు తప్పులు తడకలుగా ఉన్నాయా? రోడ్ల ఆక్రమణలు జరిగాయా? ఇలా ఎన్నో సమస్యలను ఎదుర్కొంటున్న మీరు మీ సమస్యలను నేరుగా నగరపాలక సంస్థ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం పొందండి. ఖమ్మం కార్పొరేషన్‌లో ఉన్న సమస్యలను విన్నవించుకునేందుకు కమిషనర్ అభిషేక్ అగస్త్యతో గురువారం 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్ కార్యక్రమం నిర్వహిస్తోంది. నగర ప్రజలు నగరపాలక సంస్థలోని శానిటేషన్, టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, ఇంజనీరింగ్ లాంటి పలు విభాగాలకు చెందిన పరిష్కారానికి నోచుకోని సమస్యలను నేరుగా కమిషనర్‌కు విన్నవించుకోవచ్చు.

ఫోన్ ఇన్ తేదీ
5-6-2025 (గురువారం)
సెల్ నెంబరు
99854 11368
కాల్ చేయాల్సిన సమయం
ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు

\- ఆంధ్రజ్యోతి, ఖమ్మం

పరిశోధనల్లో మేటి..

- అపరాలకు కేరాఫ్ మధిర పరిశోధనా స్థానం
- రాష్ట్రంలోనే ఏకైక పెసర, మినుము రీసెర్చ్ సెంటర్
- ఇతర రాష్ట్రాలకు ఇక్కడి నుంచే విత్తనాలు
- ఏ సీజన్‌లో అయినా సాగయ్యేలా మినుము, పెసర విత్తనాల అభివృద్ధి
- స్వాతంత్ర్యానికి ముందే ఏర్పాటైన కేంద్రం

వివరాలు : 6లో

భూ రిజిస్ట్రేషన్లలో
ఆధార్ - ఈ సైన్ విధానం

- కూసుమంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అమలు
- మరింత సులభతరంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ


కూసుమంచిలో ఈ-సైన్ ద్వారా రిజిస్ట్రేషన్లు చేస్తున్న ఎస్సార్వో

కూసుమంచి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : భూ రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో సరి కొత్త విధానానికి శ్రీకారం చుట్టారు. రిజిస్ట్రేషన్ల ప్రక్రియను మరింత సులభతరం చేయడంతో పాటు అవినీతి రహితంగా, పారదర్శకంగా నిర్వహించేలా.. ప్రజలు, ఉద్యోగులు, సిబ్బంది సమయాన్ని ఆదా చేసే ఉద్దేశ్యంతో స్లాట్ బుకింగ్, ఆధార్ ఈ-సైన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ కొత్త విధానం అమలు కోసం ప్రభుత్వం రాష్ట్రంలో రెండు కార్యాలయాలను ఎంపిక చేసింది. అందులో ఒకటి ఆర్మూర్.. మరొకటి కూసుమంచి కాగా.. మంగళవారం కూసుమంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రారంభించారు. ఆధార్ ఈ సైన్ విధానం వల్ల సుమారు 15 నిమిషాల్లోనే రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. కూసుమంచిలో తొలిరోజున 8 రిజిస్ట్రేషన్లు జరిగినట్లు అధికారులు తెలిపారు

ఈ- విధానంతో ఈజీ

గతంలో భూముల, ప్లాట్ల రిజిస్ట్రేషన్ల కోసం దళారులను (డాక్యుమెంట్ రైటర్స్)ను ఆశ్రయించాల్సి వచ్చేది. వారు ఎంత చెపితే అంత ముట్ట చెప్పాల్సి వచ్చేది. అవినీతి అక్రమాలు జరుగుతుండటంతో ప్రభుత్వం ప్రక్షాళన చేపట్టింది. నూతన విధానం ద్వారా ఇప్పటి నుంచి కచ్చితంగా యాప్ ద్వారా భూమి కొనుగోలు, అమ్మకందారులు, క్రయం జరుగుతున్న భూవివరాలతో స్లాట్ బుకింగ్ చేసుకోవాలి. ఏరోజు, ఏ సమయం అనే వివరాలు ఆ స్లాట్ బుకింగ్‌లో వస్తాయి. అప్పుడు క్రయ, విక్రయదారులు, సాక్షులు ఆసమయంలో వెళితే సరిపోతుంది. డిజిటల్ సైన్, డిజిటల్ ఫొటోలు అన్నీ ఆధార్ నెంబరు ఆధారంగా నమోదవుతాయి. ఒకవేళ ఆధార్‌లో ఉన్న వేలిముద్రలు ఇప్పుడు సరిపోలని పక్షంలో రిజిస్ట్రేషన్ నిలిచిపోతుంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తికాగానే వెంటనే డాక్యుమెంట్ అందజేస్తారు. ఈవిధానంలో మధ్యవర్తులను ఎవరినీ ఆశ్రయించాల్సిన పనిలేదు.

రోజుకు 48 రిజిస్ట్రేషన్లు మాత్రమే

ఈ స్లాట్ బుకింగ్ ద్వారా రోజుకు కేవలం 48 రిజిస్ట్రేషన్లు మాత్రమే జరిగేలా సాఫ్ట్‌వేర్ రూపొందించారు. రిజిస్ట్రేషన్ చేయించుకునే వారు కచ్చితంగా సమయం పాటించాల్సిందే. ఆలస్యమైతే.. తర్వాత రిజిస్ట్రేషన్లు ఎవరూ లేకపోతే ఆదేరోజు ప్రక్రియ జరుగుతుంది. లేదంటే మరోరోజుకు రీషెడ్యూల్ అవుతుంది.

పారదర్శకత కోసమే ఈ సైన్ విధానం

రిజిస్ట్రేషన్ల ప్రక్రియలో పారదర్శకత కోసమే ప్రభుత్వం స్లాట్ విధానం, ఆధార్ - ఈసైన్ విధానాన్ని తీసుకొచ్చింది. క్రయవిక్రయదారులు సొంతంగా యాప్ ద్వారా వివరాలు నమోదు చేసుకోవచ్చు. ఎప్పుడు రిజిస్ట్రేషన్ సమయం వస్తే అప్పుడే రావచ్చు. దీనివల్ల అందరికీ సమయం ఆదా అవుతుంది. ఎలాంటి అవకతవకలు లేకుండా చేసుకోవచ్చు. పనిభారం కూడా తగ్గుతుంది.

\- పద్మ, ఎస్సార్వో, కూసుమంచి

సీతారామతో 'ఎన్నెస్పీ'లో
ముందుగానే నాట్లు



- 10వతేదీ లోపు రాజీవ్ లింక్ కెనాల్ లైనింగ్ పనులు పూర్తి చేయాలి
- నీటి పారుదల శాఖ అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం
- ఏన్కూరు వద్ద కాల్వ లైనింగ్ పనుల పరిశీలన

7


పెదవాగు ప్రాజెక్టు కట్టకు గండి పడిన ప్రాంతం

ఈసారీ.. ఇక్కడి ఆయకట్టుకే..

- ఏపీ భూములకు పెదవాగు నీరందడం కష్టమే
- గతేడాది నిర్మించిన 'రింగ్‌బండ్'తోనే సాగునీటి సరఫరా
- మరో రెండు మీటర్ల మేర కట్ట ఎత్తు పెంపునకు యత్నాలు

అశ్వారావుపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల ఉమ్మడి ప్రాజెక్టుగా ఉన్న అశ్వారావుపేట పెదవాగు ప్రాజెక్టు నుంచి ఈ సారి కూడా తెలంగాణ ఆయకట్టుకే నీరందే పరిస్థితి కనిపిస్తోంది. గతేడాది భారీ వర్షాలకు గండి పడిన నేపథ్యంలో ఈ సీజన్‌లో రైతులకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల ప్రాజెక్టుగా ఉన్న పెదవాగు ప్రాజెక్టును పూర్తిస్థాయిలో పునర్నిర్మించాలంటే ఏపీ 82శాతం, (మిగతా 6వ పేజీలో)



ఈవోను వివరాలు అడిగి తెలుసుకుంటున్న ప్రభాకర్ రెడ్డి

రామాలయాన్ని సందర్శించిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు

» అన్యమత ప్రచారంపై ఆరా

భద్రాచలం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం రామాలయంలో అన్యమత ప్రచారం జరుగుతుందనే ఆరోపణలు వచ్చిన క్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి ఇతర నాయకులు మంగళవారం భద్రాచలం రామాలయాన్ని సందర్శించి వివరాలు సేకరించారు. భద్రాచలం దేవస్థానం ఈవో ఎల్. రమాదేవితో కులంకుషంగా రామాలయంలో అసలు ఏం జరుగుతుందో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఈవో వారితో మాట్లాడుతూ రామాలయంలో అన్యమత ప్రచారం జరగలేదని తెలిపారు. స్వామివారి శేష వస్త్రాల కాంట్రాక్టర్ స్క్రాప్‌లో వచ్చే కవర్లను తక్కువ ధరకు కొనుగోలు చేశాడని, అందులో రెండు కవర్లు అన్యమత వ్యాఖ్యలతో వచ్చాయని తెలిపారు. భక్తుల ఫిర్యాదుతో వెంటనే నోటీసులు ఇచ్చామని తెలిపారు. జరిమానా వేయడం కూడా జరిగిందని ఆమె తెలిపారు. కాగా రామాలయంలో ఎటువంటి అన్యమత ప్రచారం జరిగినా అసలు సహించేది లేదని కోరినట్లు ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఆయన వెంట రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కుంజా ధర్మా, జిల్లా ఉపాధ్యక్షుడు పసుమర్తి సతీష్, జిల్లా కౌన్సిల్ మెంబర్ నిడదవోలు నాగబాబు, సీనియర్ నాయకులు ఆవుల సుబ్బారావు, రాంమోహన్‌రావు, సత్యనారాయణ, ముక్కెర కోటేశ్వరి, మండల ప్రధాన కార్యదర్శులు వెంకన్న, ఉపేందర్ పాల్గొన్నారు.

పరిశోధనల్లో మేటి..

» అపరాలకు కేరాఫ్ మధిర పరిశోధన స్థానం
» రాష్ట్రంలోనే ఏకైక పెసర, మినుము రీసెర్చ్ సెంటర్
» ఇతర రాష్ట్రాలకు ఇక్కడి నుంచే విత్తనాలు
» ఏ సీజన్‌లో అయినా సాగయ్యేలా మినుము, పెసర విత్తనాల అభివృద్ధి
» స్వాతంత్ర్యం రాకముందే ఏర్పాటైన కేంద్రం
» ఎనిమిది దశాబ్దాలుగా రైతుకు వెన్నుదన్ను

మధిరటౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మధిర వ్యవసాయ పరిశోధనాస్థానం నూతన అపరాల వంగడాల అభివృద్ధికి, పరిశోధనలకు కేరాఫ్‌గా నిలిచింది. రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పాటు, ఇతర రాష్ట్రాలకు మినుము, పెసర వంగడాలను అందిస్తూ ఐదు దశాబ్దాలుగా తన ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. 1945లో 40 ఎకరాల్లో ఏర్పాటు చేసిన పరిశోధనాస్థానంలో తొలత పొగాకుపై పరిశోధనలు చేశారు. పొగాకు పంట సాగు తగ్గాక 1961 నుంచి మాగి జొన్నపై పరిశోధనలు కొనసాగాయి. 1971 నుంచి అపరాలపై తమ పరిశోధనలు సాగిస్తూ ఎప్పటికప్పుడు కాలానికి, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా నూతన వంగడాలను సృష్టిస్తున్నారు.

నూతన వంగడాలతో సత్ఫలితాలు

మధిర పరిశోధన స్థానం నుంచి ఇప్పటి వరకు పెసరలో ఐదు రకాల వంగడాలను అందజేశారు. పెసరలో ఎంజీజీ(మధిర గ్రీన్ గ్రామ్) 295, 347, 348, 351, 385 రకాలు అందించగా, మినుములో ఎంబీజీ 207, 1070 రకాలు, కందిలో ఎంఆర్‌జీ 66, 59, 255 , జొన్నలో మోతి, కిన్నెర, తాజాగా వరిలో డబ్ల్యూజీఎల్ 44ను సిద్ధ పేరుతో విడదల చేశారు. మినుము, పెసర విత్తనాలను ఇక్కడే సృష్టించగా కంది, వరి విత్తనాలను జగిత్యాల, వరంగల్ పరిశోధన స్థానం నుంచి తీసుకువచ్చి మధిరలో అభివృద్ధి చేసి రైతులకు అందజేస్తున్నారు.



పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

విత్తనోత్పత్తిలో అగ్రస్థానం

మధిర పరిశోధన స్థానంలో విత్తనోత్పత్తి గణనీయంగా పెరిగింది. గత ఐదేళ్లలో విత్తనోత్పత్తి 385 క్వింటాళ్ల నుంచి 1200 క్వింటాళ్లకు పెరిగింది. శాస్త్రవేత్తలు మధిర, ఎర్రుపాలెం, చింతకాని, రఘునాథపాలెం మండలాల్లోని రైతులకు పెసర, మినుము విత్తనాలను అందిస్తున్నారు. వారు పండించే పంటలను బైబ్యాక్ విధానంలో తీసుకుని వాటిని శాస్త్రీయ పద్ధతుల్లో విత్తనశుద్ధి చేసి తిరిగి రైతులకు అందజేస్తున్నారు.



కొత్త పెసర, మినుము వంగడాలు

తెగుళ్లకు చెక్..

ఇంతకు ముందు విడుదల చేసిన పెసర, మినప విత్తనాలు ఎకరాకు ఐదు నుంచి ఆరు క్వింటాళ్ల దిగుబడి ఇస్తుండగా, ఈ నూతన వంగడాల ద్వారా ఎకరాకు ఎనిమిది నుంచి తొమ్మిది క్వింటాళ్ల దిగుబడితో పాటు పల్లాకు, ఎల్లో తెగులును తట్టుకునేలా రూపొందించారు. మధిరలో తయారయ్యే మినుము, పెసర బ్రీడర్ సీడ్లను తమిళనాడు, రాజస్థాన్ రాష్ట్రాల పరిశోధన కేంద్రాల వారు తీసుకెళ్లి అభివృద్ధి చేస్తున్నారు. ఏపీ కి కూడా విత్తనాలు సరఫరా అవుతున్నాయి.

వేధిస్తున్న సిబ్బంది కొరత..

రైతులకు అనేక రకాల సేవలందిస్తున్న మధిర పరిశోధన కేంద్రంలో ఉద్యోగుల కొరత వేధిస్తోంది. ప్రధాన శాస్త్రవేత్త, ఆరుగురు శాస్త్రవేత్తలకు గాను ప్రస్తుతం ముగ్గురు శాస్త్రవేత్తలు మాత్రమే ఉన్నారు. నలుగురు ఏఈవోలకు గాను ఇద్దరు మాత్రమే పని చేస్తుండగా, మూడు ఫీల్డ్ సూపర్‌వైజర్ పోస్టులు ఖాళీగా ఉండగా, అవుట్‌సోర్సింగ్ సిబ్బందితో నెట్టుకొస్తున్నారు. అగ్రికల్చర్ వర్కర్లు ఆరుగురికిగాను ఒక్కరు మాత్రమే ఉన్నారు. టైం స్కేల్ వర్కర్స్ మాత్రం 28 మంది పని చేస్తున్నారు. దీనికి తోడు ప్రభుత్వం పరిశోధన స్థానానికి అనుబంధంగా 2012 లో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల మంజూరు అయింది. దానికి ఒక టీచింగ్ అసిస్టెంట్, ఒక ఏవో మాత్రమే ఉండగా రీసెర్చ్ సెంటర్‌లోని శాస్త్రవేత్తలే విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారు.



మధిరలోని వ్యవసాయ పరిశోధన స్థానం

అధిక దిగుబడి ఇచ్చే వంగడాలను సృష్టిస్తున్నాం

- డా. రుక్మిణీదేవి, ప్రధాన శాస్త్రవేత్త



మధిర రీసెర్చ్ సెంటర్‌లో ఎప్పటికప్పుడు కాలానికి అనుగుణంగా పరిశోధనలు సాగిస్తూ నూతన వంగడాలను సృష్టిస్తున్నాం. పెసరలో ఎంజీజీ 385రకం, మినుములో ఎంబీజీ 389 అనే వంగడాలను కొత్తగా రూపొందిం. ఇవి వచ్చే రబీ సీజన్ కల్లా రైతులకు అందుబాటులో ఉంచేందుకు కసరత్తు చేస్తున్నాం. ఈ రెండు రకాలు విత్తనాలు 365 రోజుల పాటు ఏ సీజన్‌లో అయినా సాగు చేసుకునేలా రూపొందించాం. ఇవి ఎకరాకు ఎనిమిది నుంచి తొమ్మిది క్వింటాళ్ల దిగుబడితో పాటు అనేక రకాల తెగుళ్లను సమర్థంగా తట్టుకునేలా రూపొందించాం.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

» ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు కృషిచేయాలి
» భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి. పాటిల్
» బడిబాట కార్యక్రమంపై అధికారులతో సమీక్ష



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్

కొత్తగూడెం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రవేశాలను పొందేలా బడిబాట కార్యక్రమాన్ని చేపట్టాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడీఓసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 6వ తేదీ నుంచి 19వ తేదీ వరకు బడిబాట కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందచేసే పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు, డిజిటల్ విద్య, ఉపకార వేతనాలు, ఇతర ప్రోత్సాహకాల పై అందరికి తెలియచేసి వారందర్ని ప్రభుత్వ బడుల్లో చేర్పే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 6నుంచి 14 సంవత్సరాలు కలిగిన బడిఈడు పిల్లలందర్ని గుర్తించి సమీపంలోని బడికి వెళ్లేలాగా ప్రోత్సహించాలన్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, సీపీవో సంజీవరావు, మెప్మా పీడీ రాజేష్, డీఈవో ఎం. వెంకటేశ్వరచారి, జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఇందిర, మహిళ శిశు సంక్షేమ అధికారి స్వర్ణలత లెనినా తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి సమష్టి కృషి

» సింగరేణి చైర్మన్ బలరాం



కొత్తగూడెం టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి సమష్టి కృషి జరపాలని సింగరేణి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్. బలరాం పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్‌పై యుద్ధం ప్రకటించాలని కోరారు. మంగళవారం సింగరేణి ప్రధాన కార్యాలయంలో ప్రకృతి ప్రేమికుడు, ప్రజాగాయకుడు జయరాజు అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ సింగరేణిలో ప్లాస్టిక్ వాడకాన్ని నిలిపివేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజాగాయకుడు జయరాజు మాట్లాడుతూ సింగరేణి సంస్థ బొగ్గు ఉత్పత్తితోపాటు విద్యుత్, సోలార్ విద్యుత్ రంగంలోకి పయణించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి డైరెక్టర్లు ఎల్‌వి. సూర్యనారాయణ, కొప్పుల వెంకటేశ్వర్లు, జీఎంలు కిరణ్‌కుమార్, మురళీధర్‌రావు పాల్గొన్నారు.

పాటే ఉద్యమానికి ఊపిరి పోసింది



ప్రజాకవి జయరాజు

» తెలంగాణ ఏర్పాటు ఉద్యమంలో పాటదే అగ్రస్థానం
» ప్రముఖ ప్రజాకవి జయరాజు

కొత్తగూడెం టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పాటే ప్రజా ఉద్యమాలకు ఊపిరిపోసిందని ప్రజా కవి, గాయకుడు జి. జయరాజు అన్నారు. పెత్తందారి వ్యవస్థను కూల్చడంలో కవులు, కళాకారులే కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. మంగళవారం కొత్తగూడెంలో కలిసిన విలేకర్లతో ఆయన మాట్లాడారు. నైజాం పాలనకు వ్యతిరేకంగా ఆనాటి బండి యాదగిరి రచించిన బండెనక బండి కట్టి.. అంటూ ప్రజలను చైతన్యపర్చడంలో కీలకపాత్ర పోషిస్తే, ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ప్రజాగాయకుడు గద్దర్ రచించిన పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలామా.. పోరు తెలంగాణమా వరకు పాటదే ప్రథమస్థానం అన్నారు. భూస్వాములు, పెత్తందారులకు వ్యతిరేకంగా అక్షరాలను ఒడిసికట్టి పాట రూపంలో పయణించిన సుద్దాల అశోక్ తేజ నుంచి జయరాజు వరకు పాటల ద్వారనే ప్రజలను చైతన్యం చేసి తెలంగాణ ఉద్యమాల వైపు సంపంద వర్గాలను నడిపించిందని అన్నారు. బ్రిటీష్ ప్రభుత్వానికి, నైజాం పాలనకు వ్యతిరేకంగా భూమి, భుక్తి కోసం, వెట్టిచాకిరి విముక్తి కోసం అనేక మంది త్యాగాలు చేశారని తెలిపారు. మలిదశ తెలంగాణ ఉద్యమంలో కవులు, కళాకారులు ప్రజాస్వామిక వాదులు, అనేక మంది యువకులు రక్తతర్పణ ద్వారానే తెలంగాణను సాధించుకున్నామన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో ఉద్యమకారులకు సముచిత గౌరవం లభించిందని తెలిపారు. ఉద్యమాల ద్వారా సాధించుకున్న తెలంగాణలో ఆ ఫలాలను అందరికి పంచాలని విజ్ఞప్తి చేశారు.

రైతు సంక్షేమం కోసమే.. భూ భారతి

(5వ పేజీ తరువాయి)

లేకుండా వందల ఎకరాలకు పాస్‌బుక్స్ అందించిన చరిత్ర వారిదన్నారు. భూ భారతిలో అన్నిటిపై విచారణ చేసి రైతులను ధరణి నుంచి కాపాడేందుకు ప్రజాప్రభుత్వం నడుంబిగించిందన్నారు. ప్రజలకిచ్చిన మాట మేరు ధరణిని బంగాళఖాతంలో వేశామన్నారు. రెవెన్యూసదస్సుల్లో ప్రజలనుంచి వచ్చే దరఖాస్తులను ఆగస్టు15 నాటికి పరిష్కరిస్తామని తెలిపారు. భూ సర్వే రికార్డులు, మ్యాపులు లేకుండా రైతులు ఇబ్బందిపడుతున్నారని, అది గుర్తించే.. పైలెట్ ప్రాజెక్టు కింద ములుగుమాడు గ్రామాన్ని ఎంపికచేసి సర్వేకు శ్రీకారం చుట్టామన్నారు. దశలవారీగా ప్రతీ భూమిని సర్వేచేసి ఆధార్ తరహాలో నెంబరు ఇస్తామన్నారు. తద్వారా ప్రతీ రైతుకు భూ భద్రత ఉంటుందన్నారు. అలాగే జమాబందీ కార్యక్రమాన్ని కూడా గ్రామసదస్సుల్లో ప్రవేశపెట్టనున్నట్టు వివరించారు. భవిష్యత్తులో అసెంబ్లీ నియోజకవర్గాలవారీగా అసైన్‌మెంట్ కమిటీలు ఏర్పాటుచేసి మిగులుభూములు గుర్తించి పంపిణీ చేస్తామని ప్రకటించారు.

సాంకేతిక వినియోగంతో సమస్యలకు పరిష్కారం

రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్




భూ రికార్డులు సక్రమంగా లేక ఎంతో మంది రైతులు ఇబ్బందులు పడుతున్నారని, 1950 నాటి రికార్డులే ఇంకా అనుసరించాల్సి వస్తోందని, భూభారతి ద్వారా సాంకేతికతను వినియోగించి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపబోతున్నామని రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటరి నవీన్‌మిట్టల్ పేర్కొన్నారు. రాష్ట్రంలో 2కోట్లవరకు సర్వేనెంబర్లలో సబ్‌డివిజన్లుంటే, 40లక్షలవరకు మాత్రమే మ్యాపులు అందుబాటులో ఉన్నాయని, విలేజ్‌మ్యాపులు లేని గ్రామాలు 413 గుర్తించామన్నారు. డ్రోన్ డీజీపీఎస్ ఆధునికత సాంకేతిక పరిజ్ఞానంతో సర్వేచేసి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా భూభారతి సదస్సులు ప్రారంభమయ్యాయని, ఈ దరఖాస్తులన్నింటిని త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. సర్వేసెటిల్‌మెంట్ ల్యాండ్ రికార్డ్సు కమిషనర్ డాక్టర్ జ్యోతి బుద్ధప్రకాష్ మాట్లాడుతూ ఈసర్వే కీలకమైందని, ఇందులో వచ్చే ఫలితాల ఆధారంగా రాష్ట్రంలో భూ సర్వే కార్యక్రమం నిరంతరంగా జరుగుతుందన్నారు. ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ ములుగుమాడులో పైలెట్ ప్రాజెక్టు కింద సర్వే చేపట్టామని, సర్వే అనంతరం రైతులకు అన్ని హక్కు పత్రాలు అందిస్తామన్నారు. ఈ గ్రామంలో రైతుల భూములకు సంబంధించి సర్వే రికార్డులు లేవని తెలిపారు. నెలరోజుల్లోపు భూసర్వే నిర్వహిస్తామని, గ్రామంలో మూడు సర్వే బృందాలు అధునాతన సాంకేతికతో డీజీపీఎస్, డ్రోన్లతో సర్వేనిర్వహిస్తున్నాయని వివరించారు. సభ అనంతరం డ్రోన్లు ఎగురవేసి ఉపముఖ్య మంత్రి భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి భూ సర్వే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం సీపీ సునిల్‌దత్, వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్, ఆర్‌అండ్‌బీఎస్‌ఈ యాకుబ్, జేడీఏ పుల్లయ్య, ఆర్డీవో నరసింహారావు, డీసీసీబీ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, సర్వే ల్యాండ్స్ రికార్డు జేడీ ప్రసన్నలక్ష్మి, ఏడీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.




డ్రోన్ ఎగురవేసి భూ భారతి సర్వేను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం, మంత్రులు

ఇది విప్లవాత్మక చట్టం : మంత్రి తుమ్మల



రైతులు భూసమస్యలు సత్వరం పరిష్కరించేలా రూపొందించిన భూభారతి చట్టం ఓ విప్లవాత్మకమైందని, ఈ చట్టంలో భాగంగా నిర్వహించే భూసర్వే, రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. భూములు లేకపోయినా కొందరు రైతులు పాసుపుస్తకాలు తీసుకుని ప్రభుత్వ పథకాల లబ్ధిపొందుతున్నారని ఇలాంటి వారి భూములు గుర్తించడమే భూ భారతి లక్ష్యమన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏ ప్రభుత్వం చేయని సాహసం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చేసి చూపుతోందన్నారు. ములుగుమాడులో జరిగే భూ సర్వే రాష్ట్రానికి దిక్సూచి కాబోతోందని, గతంలోని ధరణితో కొందరు భూములు లేకపోయినా ఉన్నట్టుగా పాసుపుస్తకాలు సృష్టించి రైతుభరోసా, రుణమాఫీ లాంటి పథకాలు పొంది.. అర్హులకు అన్యాయం చేశారని, భూ భారతి సర్వేలో వాస్తవాలు వెలుగులోకి వస్తాయన్నారు. నిజమైన రైతులకు లబ్ధి చేయడమే తమ ధ్యేయమన్నారు. భూ రికార్డులు, పాస్ పుస్తకాల్లో తప్పులతో ఎంతో మంది ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, భూముల ధరలు పెరగడంతో తేబుట్టువులు, కుటుంబసభ్యుల మధ్య వివాదాలు పెరుగుతున్నాయని ఇది విచారించాల్సిన విషయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో గ్రామపెద్దలు, రచ్చబండల్లో భూ వివాదాలపై పంచాయితీలు పెడుతున్నారని, భూ భారతితో అవన్నీ పరిష్కారం కాబోతున్నాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి నేతృత్వంలో భూ సమస్యలకు పరిష్కారం చూపి రెవెన్యూ శాఖ మంత్రిగా పొంగులేటి శ్రీనివాస రెడ్డి పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందన్నారు. విచ్ఛిన్నమైన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడంతో పాటు.. గత ప్రభుత్వం అమలు చేసిన పాత పథకాలతోపాటు కొత్తగా పలు సంక్షేమ పథకాలను అందిస్తూ అన్ని వర్గాలు మెచ్చేలా ప్రజా ప్రభుత్వం ముందుకు పోతుందన్నారు. అత్యధికంగా ధాన్యం పండించిన రాష్ట్రంగా తెలంగాణ దేశానికే తలమానికంగా నిలిచిందని, ప్రధాని కూడా ఈ విషయాన్ని ఒప్పుకున్నారని గుర్తుచేశారు. పేదలకు పథకాలను అందించే విషయంలో తమ ప్రభుత్వం రాజీ పడబోదని, ఓట్లకోసం భయపడి తలొగ్గే పరిస్థితి ఉండదన్నారు. పూర్తిస్థాయిలో శాంతి భద్రతలు అదుపులో ఉన్న రాష్ట్రంగా తెలంగాణను కేంద్రం గుర్తించిందని, పక్కరాష్ట్రాలతోకాదు ప్రపంచ దేశాలతో పోటీపడాలన్నదే ముఖ్యమంత్రి ఆశయమన్నారు భూ రికార్డులు భద్రంగా ఉండాలంటే యజమానులనుంచి కొంత టోకెన్ అమౌంట్ సేకరించాలని, గతంలో భూమి శిస్తు విధానంతో ప్రతిరైతు ఏటా శిస్తు చెల్లించి.. తమ భూములు రికార్డుల్లో సక్రమంగా ఉన్నాయో లేవో తెలుసుకునే వారని. ఇప్పుడా ఆ విధానం లేకపోవడంతో రికార్డులను మారుస్తున్నా తెలుసుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. నాట్లు వేయకముందే రైతుభరోసా వేస్తామని, ఇందిరమ్మ ఇళ్లను కూడా అర్హులకే ఇచ్చేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలన్నారు.

ఆగస్టు 15 నాటికి దరఖాస్తులకు పరిష్కారం: పొంగులేటి



రాష్ట్రంలో రెవెన్యూ చట్టాన్ని ప్రక్షాళన చేసేలా అమలు చేస్తున్న భూ భారతి చట్టం ద్వారా.. భూ పరిపాలనను ప్రజల వద్దకే తీసుకెళ్తున్నామని, రెవెన్యూ సదస్సుల్లో వచ్చే దరఖాస్తులను ఆగస్టు 15 నాటికి పరిష్కరించి తీరుతామని రెవెన్యూ గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ప్రజల ఆకాంక్షల మేరకు ఏప్రిల్ 14వతేదీన భూ భారతి చట్టాన్ని అమల్లోకి తెచ్చామని, మొదటి దశలో అదే నెల 17వతేదీనుంచి నాలుగుజిల్లాల్లోని నాలుగు మండలాల్లో ప్రయోగాత్మకంగా సదస్సులు నిర్వహించామన్నారు. ఆతర్వాత మే 5వతేదీనుంచి 28జిల్లాల్లోని 28 మండలాల్లో, మంగళవారం నుంచి 20వతేదీవరకు అన్ని మండలాల్లో సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల వద్దకే రెవెన్యూ అనే నినాదంతో అన్ని రెవెన్యూ గ్రామాలకు తహసీల్దార్‌తో కూడిన బృందం వెళుతుందని, దరఖాస్తులు స్వీకరించి పరిష్కరిస్తామన్నారు. భూ భారతి చట్టంలో భాగంగా 3550 మంది గ్రామ పరిపాలన అధికారులను (జీపీవో) అతి త్వరలో నియమించనున్నామని తెలిపారు. భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం రిజిస్ట్రేషన్ సమయంలో డాక్యుమెంట్లతో పాటు సర్వే మ్యాపు జతపరచాలని చట్టంలో పేర్కొన్నామన్నారు. ఇందుకు అనుగుణంగా సర్వే సెటిల్‌మెంట్ విభాగాన్ని బలోపేతం చేసేందుకు గాను రెండు నెలల్లో మొదటి విడతగా 6వేల మంది సర్వేయర్లను నియమించబోతున్నామన్నారు. తరతరాలుగా నక్షా లేని 413 గ్రామాల్లో పునః సర్వే నిర్వహిస్తున్నామని, అందులో భాగంగానే ములుగుమాడు గ్రామాన్ని పైలెట్‌ప్రాజెక్టుగా ఎంపిక చేశామన్నారు. ధరణిపేరుతో గత ప్రభుత్వం అన్ని రికార్డులను తారుమారుచేసిందని ఆరోపించారు. ప్రతీ భూమికి ఆధార్ తరహాలో భూధార్ ఇవ్వబోతున్నామని, లైసెన్సుడ్ సర్వేయర్ల ద్వారా రైతులు స్వచ్ఛందంగా సర్వేలు చేయించుకునే అవకాశం కల్పిస్తున్నామన్నారు. డ్రోన్లతో పాటు డీజీపీఎస్ టెక్నాలజీ, శాటిలైట్ సిస్టం ద్వారా సర్వేలు చేసి ప్రతీ భూమికి కొలతల మ్యాపు, గ్రామంలో రెవెన్యూ రికార్డులో భూముల వివరాలు, సర్వేనెంబర్లు, భూధార్ నెంబర్ ఇలా శాశ్వత రికార్డులు పొందుపర్చి పాస్‌పుస్తకాలు అందిస్తామన్నారు. తద్వారా భవిష్యత్‌లో వారసులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భూములకు రక్షణగా ఉండేందుకు గాను గ్రామపరిపాలన అధికారిని నియమించామని వివరించారు.

తొలిరోజు వెల్లువెత్తిన అర్జీలు

» ఖమ్మం జిల్లాలో 37 గ్రామాల్లో , భద్రాద్రిలో 55 గ్రామాల్లో సదస్సులు
» ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 8341 దరఖాస్తులు

ఖమ్మం కలెక్టరేట్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టింది. తొలిరోజైన మంగళవారం ఖమ్మం జిల్లాలో 19 మండలాల్లో 37గ్రామసభలు నిర్వహించగా 3,153 దరఖాస్తులు వచ్చాయి. భూ భారతి , కొత్త ఆర్వోఆర్ చట్టం 2025 అమల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం జిల్లాలో నేలకొండపల్లి మండలాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసింది. అక్కడ సదస్సులు పూర్తవగా.. మంగళవారం అన్ని రెవెన్యూ గ్రామాల్లోనూ వీటిని ప్రారంభించారు. ఎర్రుపాలెం మండలం ములుగుమాడు గ్రామం నుంచి భూ భారతి సర్వే, రెవెన్యూ సదస్సులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శ్రీకారం చుట్టారు.

రైతుల వద్దకే అధికారులు..

రెవెన్యూ గ్రామాల వారీగా రైతుల వద్దకే అధికారులు వెళ్లి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు వారికి అందుబాటు లో ఉండి దరఖాస్తులు తీసుకోవాలన్న లక్ష్యంతో గ్రామ పంచాయతీల వారీగా సదస్సులు నిర్వహిస్తున్నారు. ఒక్కో మండలంలో రెండు, మూడు బృందాలను ఏర్పాటు చేసి వీటిని నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు జరిగిన 37 సదస్సుల్లో 3,153 దరఖాస్తులు అందినట్లు జిల్లా అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి తెలిపారు.

మండలాల వారీగా వచ్చిన దరఖాస్తులిలా

19 మండలాల్లో రెండు చొప్పున రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఖమ్మం అర్బన్‌లో ఒకటి, ముదిగొండలో మాత్రం మూడు చోట్ల సదస్సులు జరిగాయి. ఖమ్మం అర్బన్ 332 దరఖాస్తులు అందాయి. ఖమ్మం రూరల్ మండలంలో 54, తిరుమలాయపాలెంలో 181, కూసుమంచిలో 85, చింతకానిలో 132, ముదిగొండలో 103, కొణిజర్లలో 315, సింగరేణిలో 210, కామేపల్లిలో 124, మధిరలో 63, ఎర్రుపాలెంలో 14, వైరాలో 134, రఘునాథపాలెంలో 194, సత్తుపల్లిలో 115, వేంసూరులో 143, పెనుబల్లిలో 87, కల్లూరులో 303, తల్లాడలో 353, ఏన్కూరులో 211 అర్జీలు వచ్చాయి.

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోనూ రెవెన్యూ సదస్సులు ప్రారంభమయ్యాయి. 23 మండలాల్లో మొత్తం 55 రెవెన్యూ గ్రామాల్లో అధికారులు సదస్సులు నిర్వహించగా.. ప్రజలు వివిధ భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 5,188 దరఖాస్తులు అందజేశారు.

ఈసారీ.. ఇక్కడి ఆయకట్టుకే..

(5వ పేజీ తరువాయి)

మిగతా 18శాతం నిధులు తెలంగాణ ప్రభుత్వం వెచ్చించాల్సి ఉంది. గత పదేళ్లలో ఇరు ప్రభుత్వాలు ఈ ప్రాజెక్టుకు నిధులు కేటాయించకపోవడంతో నిర్లక్ష్యానికి గురైంది. ఇదే క్రమంలో గతేడాది కురిసిన భారీ వర్షాలకు ప్రాజెక్టు కట్టకు భారీ గండి పడింది. ఆ తరువాత తెలంగాణ ప్రభుత్వం అత్యవసరంగా ప్రాజెక్టుకు రింగ్‌బండ్‌ను నిర్మించి మీటరు మేర నీటిని కాలువల్లోకి మళ్లించి తెలంగాణ భూభాగంలోని సుమారు 2,500 ఎకరాల ఆయుకట్టుకు తాత్కాలికంగా సాగునీరు అందించింది. ఆ తరువాత తెలంగాణ ప్రభుత్వం ఏపీ ప్రభుత్వంలో సంప్రదింపులు జరిపి ప్రాజెక్టు తెలంగాణలో ఉన్నా ఆయకట్టులో 82శాతం ఏపీలో ఉందని, ఆ మేరకు నిధులు కేటాయిస్తే పెదవాగును పునర్మించవచ్చునని ప్రతిపాదనలు పంపారు. ప్రాజెక్టు పునర్నిర్మాణానికి రూ.90కోట్లుకు పైగా ఖర్చు అవుతున్నట్టు అంచనాలు తయారు చేశారు. తెలంగాణ ప్రభుత్వ ప్రతిపాదనలను ఏపీ కూడా అంగీకరించింది. కానీ ఈ రోజు వరకు పూర్తిస్థాయి అనుమతులు, నిధులు కేటాయించకపోవడంతో టెండర్ ప్రక్రియ ప్రారంభం కాలేదు. జూన్ రావడం.. వర్షాకాలం కూడా ప్రారంభం కావడంతో.. కొద్దిరోజుల్లో పూర్తిస్థాయి అనుమతులు వచ్చినా ఈ ఏడాది నిర్దేశించిన పనులు పూర్తి కావడం కష్టమేనని.. ఏపీ పరిధిలో ఉన్న ఆయకట్టుకు నీరందించడం కష్టమేనని స్పష్టమవుతోంది. వచ్చే ఏడాదికి ఈ పనులు పూర్తయి పూర్తి ఆయకట్టుకు సాగు నీరందే అవకాశం ఉంది. అయితే అప్పటి వరకు తెలంగాణ భూ భాగంలోని సమారు 2,500 ఎకరాల ఆయకట్టుకు రింగ్‌బండ్ ద్వారా నీటిని మళ్లించి సాగునీటిని అందించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. అవసరమైతే ప్రాజెక్టు కట్టను మరో రెండు మీటర్ల మేర పెంచడం ద్వారా మరింత నీటిని నిల్వ చేసి తెలంగాణా ఆయకట్టుకు పూర్థిస్థాయిలో ఈ సీజన్‌లో సాగు నీటిని అందించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. ఈ విషయమై నీటిపారుదల శాఖ అశ్వారావుపేట డీఈఈ కృష్ణను సంప్రదించగా.. ఈ సీజన్‌కు తెలంగాణాలోని ఆయుకట్టుకు నీరందించేందుకు కృషి చేస్తున్నామని, ఏపీ ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన తరువాత వచ్చే సీజన్‌నాటికి ప్రాజెక్టును పూర్తిస్థాయిలో పునరిర్మాణం చేపడతామని తెలిపారు.

'సీతారామ'తో ఎన్నెస్పీ ఆయకట్టులో

ముందుగానే వరి నాట్లు

- 10వ తేదీలోగా రాజీవ్ లింక్‌కెనాల్ లైనింగ్ పనులు పూర్తి చేయాలి
- ఇరిగేషన్ అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం
- ఏన్కూరు వద్ద కాల్వ లైనింగ్ పనుల పరిశీలన


రాజీవ్‌లింక్‌కెనాల్ పనులు పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి)/ఏన్కూరు : జిల్లాలోని ఎన్నెస్పీ ఆయకట్టులో ఈ ఏడాది ముందుగా వరినాట్లు పడేలా కృషి చేస్తున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. వర్షాకాలం వచ్చినందున సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను వైరా ప్రాజెక్టుకు పంపించేందుకు అవసరమైన రాజీవ్‌లింక్‌కెనాల్ (ఏన్కూరులింక్‌కెనాల్) పనులను 10వ తేదీ లోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఏన్కూరు మండలంలో సాగర్ కాలువను అనుసంధానం చేసే రాజీవ్‌లింక్‌కెనాల్ లైనింగ్ పనులను మంగళవారం మంత్రి తుమ్మల పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాల్వ లైనింగ్ పనుల్లో నిర్లక్ష్యం వహించవద్దని, త్వరగా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. గోదావరికి వరద రాగానే సీతారామా లిఫ్ట్ నుంచి గోదావరి జలాలను ఏన్కూరు లింక్‌కెనాల్ ద్వారా సాగర్ ఆయకట్టుకు మళ్లించి ఎన్నెస్పీ ఆయకట్టులో ముందుగానే వరినాట్లు పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. 8.86కి.మీటర్లు ఉన్న రాజీవ్ లింక్ కెనాల్ పరిధిలో ఇప్పటికే 7.86కి.మీ మేర లైనింగ్ పనులు పూర్తయినందున మిగిలిన కిలోమీటరు పనులు కూడా త్వరగా పూర్తి చేస్తేనే నీటి విడుదలకు అవకాశం ఉంటుందని తుమ్మల తెలిపారు. సత్తుపల్లి ప్రాంతంలో యాతాలకుంట టన్నెల్ పనులు వేగంగా జరుగుతున్నాయని, తద్వారా సత్తుపల్లి, అశ్వారావుపేట నియోజకవర్గాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. ఏన్కూరు లింక్‌కెనాల్ ద్వారా జూన్‌లోనే నీరు విడుదల చేస్తే రెండునెలల ముందే రైతులు వరి నాట్లు పూర్తి చేసే అవకాశం ఉంటుందన్నారు. గోదావరి, కృష్ణా జలాలతో సాగర్‌ఆయకట్టును సస్యశ్యామలం చేయడమే రాజీవ్ లింక్‌కెనాల్ లక్ష్యమన్నారు. ఇప్పటికే సీతారామ ప్రాజెక్టు పరిధిలోని 1, 2, 3ఎత్తిపోతల పంపుహౌజ్‌లను గతేడాది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారని, ఆ లిఫ్టుల ద్వారా ఈనెలలోనే నీటిని ఎత్తిపోసే అవకాశం ఉండడంతో కాల్వల్లో పేరుకుపోయిన చెత్త, మట్టి కుప్పటలను సత్వరం తొలిగించాలని అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని వినతి


మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

కొత్తగూడెం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో టీచర్స్, హెల్పర్స్ ఎదుర్కొంటున్న సమస్యలపై ఐసీడీఎస్ మంత్రి సీతక్కను ములుగు జిల్లా క్యాంపు కార్యాలయంలో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ పెంచుతూ ఇచ్చిన జీవో నెం.8ని సవరించాలని, మినీ టీచర్స్ పెండింగ్ వేతనాలు, 24రోజుల సమ్మెకాలం వేతనాలు, ఇతర హామీలపై మంత్రితో చర్చలు జరిపారు. చర్చల అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ జీవో నెం.8ని వెంటనే సవరిస్తామని, 2024 జూలై 1 నుంచి రిటైర్‌మెంట్ అయిన అంగన్‌వాడీ ఉద్యోగులందరికీ పెంచిన రిటైర్‌మెంట్ బెన్‌ఫిట్స్ వర్తింపచేస్తామని హామీ ఇచ్చారు. ఎలాంటి షరతులు లేకుండా ఆసరా పెన్షన్ వర్తించే విధంగా ప్రత్యేక సర్క్యులర్ ఇవ్వాలని కోరగా సర్క్యులర్ ఇచ్చే విధంగా చూస్తామని, మిని టీచర్స్ 11 నెలల పెరిగిన వేతనాలు ఏరియార్స్ చెల్లించడం కోసం ప్రయత్నం జరుగుతుందని అన్నారు. కారుణ్య నియామకాలు కూడా ఇచ్చే విధంగా పరిశీలన చేస్తున్నామని, 24రోజుల సమ్మె వేతనాలు తప్పకుండ చెల్లిస్తామని తెలిపారు. ఆర్థిక పరిస్థితి బాగలేదని కొంత ఆలస్యం అయ్యే అవకాశం ఉందని, దసరా సందర్భంగా రెండవ దఫాలో ఇందిరమ్మ ఇళ్లను కూడా అంగన్‌వాడీ ఉద్యోగులకు ఇచ్చే విధంగా చూస్తామన్నారు.అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కే. సునిత, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. జయలక్ష్మి, రాష్ట్ర కోశాధికారి పి. మంగ, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కే. సమ్మక్క, రాష్ట్ర నాయకురాలు సీహెచ్. రమాకుమారి, ములుగు జిల్లా అంగన్‌వాడీ అధ్యక్షురాలు సరోజన, భాగ్యమ్మ, ధనలక్ష్మి, రుక్మిణి, రత్నం, రాజేందర్ ఉన్నారు.

విపత్తు సమయంలో నష్టాన్ని నివారించాలి

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్


మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంకలెక్టరేట్, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : విపత్తు సమయంలో నష్టాన్ని నివారించేందుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో విపత్తుల నిర్వహణపై ఏర్పాటు చేసిన జిల్లా డిజాస్టర్ మేనేజ్మెంట్ ప్లాన్ (డీడీఎంపీ) సమావేశంలో ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస్ రెడ్డి, ఎన్డీఆర్ఎఫ్ బృందంతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం వరదల కారణంగా ప్రభావితమైన ప్రాంతాలను ఎంపీడీఓలు మండలాల వారీగా, పట్టణాలు, నగరాలలో మునిసిపల్ కమిషనర్లు గుర్తించి అక్కడ ప్రస్తుత క్షేత్రస్థాయి పరిస్థితులు పరిశీలించి నివేదికలను అందించాలన్నారు. జూన్ 15 నుంచి మహబూబాబాద్, వరంగల్ జిల్లాలలో కురిసే వర్షం వివరాలను కూడా ట్రాక్ చేస్తు, నదీ ప్రవాహాల వివరాలను వాట్సప్ గ్రూపుల ద్వారా జిల్లా అధికారులకు అందిస్తామని కలెక్టర్ తెలిపారు. ప్రతి మండల కేంద్రంలో విపత్తు నిర్వహణ మేనేజ్మెంట్ ప్రణాళిక రూపకల్పనపై గురువారం అధికారులతో నిర్వహించాలని కలెక్టర్ సూచించారు.

కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం

జిల్లా కలెక్టరేట్‌లో 24 గంటల పాటు కంట్రోల్ రూం పని చేయాలని, 1077 నెంబర్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించి సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని, కంట్రోల్ రూమ్ లో పనిచేసే సిబ్బందికి షిఫ్ట్ ల వారీగా విధులు కేటాయించాలని అన్నారు. ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ మాట్లాడుతూ వరదల సమయంలో ప్రజలకు తక్షణ స్పందన, సహాయం రెవెన్యూ శాఖ నుంచి వస్తుందని, అత్యవసర ఎమర్జెన్సీ పరిస్థితులలో ప్రజల ప్రాణాల సంరక్షణకు పోలీసు అధికారులు సైతం పూర్తి స్థాయిలో కృషి చేస్తారని అన్నారు. మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ ఖమ్మం నగరంలో 12 డివిజన్లను సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించి అక్కడ నష్ట నివారణ చర్యలు చేపట్టామని అన్నారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ మాట్లాడుతూ గురువారం మండల, మున్సిపాలిటీ స్థాయిలో నిర్వహించే సమావేశంలో వల్నరబుల్ గ్రామాల సంఖ్య ఆధారంగా అవసరమైన లైఫ్ జాకెట్ వివరాలు, ప్రతి మండలంలో ఏర్పాటు చేసే రిలీఫ్ సెంటర్ జాబితా వివరాలను అందించాలన్నారు. అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ వల్నరబుల్ ప్రాంతాల్లో మాక్ డ్రిల్ నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఏ. పద్మశ్రీ, జడ్పీ సీఈవో దీక్షా రైనా, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి సన్యాసయ్య, జిల్లా అధికారులు, ఎన్డీఆర్ఎఫ్ బృందం, ఏఎస్ఐ మద్దిలేటి, హెడ్ కానిస్టేబుల్స్ జగదీష్, సురేష్ కుమార్, కానిస్టేబుల్స్ రియాజుద్దీన్, కె.జనార్ధన్ పాల్గొన్నారు

గిరిజన మ్యూజియం అభివృద్ధికి కృషి

- ఐటీడీఏ పీవో రాహుల్


మాట్లాడుతున్న పీవో రాహుల్

భద్రాచలం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం ఆవిర్భవించి 11వసంతాలు దాటి 12వసంతాలలోకి అడుగుపెట్టి తెలంగాణ వేడుకలు ఏ విధంగా జరుపుకున్నామో గిరిజన మ్యూజియం ప్రారంభించి 45రోజులలో సందర్శకుల తాకిడిని చూసి విజయోత్సవం జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి రాహుల్ అన్నారు. సోమవారం రాత్రి గిరిజన మ్యూజియం ప్రాంగణంలో ఐటీడీఏ యూనిట్ అధికారులు ఏర్పాటు చేసిన మ్యూజియం విజయోత్సవ సభ కార్యక్రమంలో ఆయన సతీసమేతంగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మ్యూజియం ప్రారంభించి 45రోజులు అయిందని ప్రజల ఆదరణ చూసి మ్యూజియంను కొత్త హంగులతో చూపారులకు ప్రతిబింబించేలా మ్యూజియం పరిధిని పెంచి పర్యాటకులకు ఆహ్లాదం అనుభూతి కలిగేలా తయారు చేయడానికి నా ఒక్కడి కృషి మాత్రం కాదని అందరి సలహాలు సూచనలు తీసుకొని మ్యూజియంలోని కళాఖండాలు, మట్టి ఇల్లులు బోటింగ్ పాయింట్ బాక్స్ క్రికెట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇంకా కొత్త హంగులతో మ్యూజియాన్ని రూపొందించి శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానానికి వచ్చే భక్తులు తప్పనిసరిగా మన మ్యూజియాన్ని ఉదయం నుంచి సందర్శించే విధంగా వారం పది రోజుల్లో అద్భుతమైన టూరిజం స్పాట్‌గా ఏర్పాట్లు చేస్తామని అన్నారు. ఐటీడీఏ మ్యూజియం ఇంత అందంగా రూపొందించడానికి ఐటీసీ, నవభారత్ సంస్థ సోలార్ ప్యానల్, సీసీ కెమెరాలు, క్రీడా పరికరాలు గ్రామపంచాయతీ తరపున సిబ్బంది, యూ నిట్ ఐటీడీఏ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపి ఈ ప్రాంగణంలో అందమైన గిరిజన మ్యూజియం ఏర్పాటు కావడానికి కృషి చేశారని అన్నారు. రాబోయే ఆరు నెలల్లో తప్పనిసరిగా ఈ మ్యూజియం పేరు ఖండంతరాలకు తెలిసే విధంగా చర్యలు చేపడుతామని అన్నారు. అనంతరం చిన్నారులు పరదర్శించిన కళా ప్రదర్శనలు తిలకించారు.

మ్యూజియం అభివృద్ధికి పాటుపడిన అధికారులకు, సిబ్బందికి అభినందిస్తూ మెమొంటోలు అందించారు. ట్రైబల్ మ్యూజియం నిర్మాణానికి కృషి చేసిన పీవోకు యూనిట్ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్, డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారిని మణె మ్మ, ఏవో సున్నం రాంబాబు, ఈఈ వెల్ఫేర్ చంద్రశేఖర్, ఏపీవో పవర్ వేణు, డీఎస్ఓ ప్రభాకర్‌రావు, జీసీడీవో అలివేలు మంగతాయరు, డీఈ హరీష్, టీఏ శ్రీనివాస్, జేడీఎం హరికృష్ణ, మ్యూజియం ఇన్‌చార్జి వీరస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ కుంగ్‌ఫూ, కరాటే పోటీల్లో

భద్రాద్రి జిల్లా క్రీడాకారుల ప్రతిభ


పతకాలు సాధించిన క్రీడాకారులతో సీనియర్ శిక్షకుడు కాశీహుస్సేన్

చుంచుపల్లి, జూన్3(ఆంధ్రజ్యోతి): జాతీయ కుంగ్‌ఫూ, కరాటే పోటీల్లో భద్రాద్రి జిల్లా క్రీడాకారులకు నాలుగు పతకాలు సాధించారని సీనియర్ కుంగ్‌ఫూ కరాటే మాస్టర్, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.కాశీహుస్సేన్ మంగళవారం తెలిపారు. ఇటీవల ఖమ్మంలో ముగిసిన జాతీయ స్థాయి కుంగ్‌ఫూ, కరాటే ఛాంపియన్ షిప్ పోటీలలో జిల్లాకు చెందిన పలువురు పాల్గొని పతకాలు గెలుపొందారని తెలిపారు. వీరిలో అండర్-17 బాలుర కటాస్ విభాగంలో కె.లికిత్‌చరణ్‌కు బంగారు పతకం, అండర్-14 బాలికల కటాస్ విభాగంలో వి.సాయి శృతి కాంస్యం పతకం, అండర్ -12 బాలికల కటాస్ విభాగంలో వి.సంతోషి కాంస్యం పతకం, అండర్-10 బాలికల కటాస్ విభాగంలో వి.షణ్ముఖ వెండి పతకాన్ని సాదించారు. ఈ క్రీడాకారులు కుంగ్‌ఫూ, కరాటే శిక్ష కురాలు పి.నిహారిక వద్ద శిక్షణ పొందుతున్నారు. పతకాలు గెలుపొందిన సందర్భంగా జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ చీఫ్ ప్యాట్రన్స్ నాగ సీతారాములు, చైర్మన్ ఎస్‌కె.షాబీర్‌పాషా, ఒలింపిక్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.మహిధర్ అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

7, 8వ తేదీల్లో బ్యాడ్మింటన్ ఎంపికలు

చుంచుపల్లి, జూన్3(ఆంధ్రజ్యోతి): భద్రాద్రి జిల్లా బ్యాడ్మింటన్ జట్టుకు ఎంపికలు ఈ నెల 7న నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ సెక్రెటరీ డాక్టర్ సావిత్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెం నియోజకవర్గంలోని సుజాతనగర్ మండలంలోని వేపలగడ్డ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 7వ, 8వ తేదీల్లో ఈ పోటీలు ఉంటాయని తెలిపారు. ఈ పోటీల్లో సింగిల్స్‌లో పాల్గొనే వారు రూ.800, డబుల్స్, మిక్సిడ్ డబుల్స్‌లో పాల్గొనే వారు రూ.1000, ప్రభుత్వ పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఒక్కోక్క ఈవెంట్‌కు కేవలం రూ.200 మాత్రమే ఎంట్రీ ఫీజుగా ఖరారు చేసినట్లు తెలిపారు. ఎంట్రీలు అధికార వెబ్ సైట్‌లో కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే స్వీకరిస్తామన్నారు.

మరో యువతితో భర్త సహజీవనం

- ఇద్దరిని నిర్బంధించి ధర్నా చేసిన భార్య
- తల్లాడ మండలం మల్సూర్‌తండాలో ఘటన


ధర్నా చేస్తున్న భార్య, బంధువులు

తల్లాడ, జూన్3 (ఆంధ్రజ్యోతి): మరో యవతితో సహజీవనం చేస్తున్న భర్తను భార్య నిర్బంధించింది. ఈ సంఘటన మంగళవారం తల్లాడ మండలం మల్సూర్‌తండాలో జరిగింది. భూక్యా నాగేశ్వరావు మరో యువతితో సహజీవనం చేస్తుండగా, వారిద్దరిని భార్య వాణి ఇంటిలో నిర్బంధించింది. ఇంటిఎదుట ఏడేళ్ల కుమారుడు, బంధువులతో కలిసి ధర్నాకు దిగింది. 9ఏళ్లక్రితం నాగేశ్వరరావుకు కొణిజర్ల మండలం రాజ్యాతండాకు చెందిన గుగులోతు వాణితో వివాహం జరిగింది. వీరికి కుమారుడు జన్మించాడు. భర్త నాగేశ్వరావు వేధింపులకు గురి చేస్తున్నాడని వాణి ఫిర్యాదు మేరకు 2019లో నాగేశ్వరరావుపై పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రస్తుతం కోర్టులో వేధింపులు, మనోవర్తి, విడాకుల కేసులున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం మల్సూరుతండాలో ఇంటిలో భర్త నాగేశ్వరావు, సదరు యువతితో ఉండగా వాణి నిర్బంధించింది. ఈవిషయమై డయల్100కు సమాచారం అందిడంతో తల్లాడ పోలీసులు అక్కడకు చేరుకుని నాగేశ్వరరావుతోపాటు యువతిని తల్లాడ పోలీసుస్టేషన్‌కు తరలించారు. కౌన్సెలింగ్ నిర్వహించారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన 39మందికి జరిమానా

కొత్తగూడెంలీగల్,జూన్3(ఆంధ్రజ్యోతి): మద్యంతాగి వాహనాలు నడిపిన 39మందికి కొత్తగూడెం కోర్టు జరిమానా విధించింది. స్పెషల్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లు మంగళవారం ఈ తీర్పు చెప్పారు. కొత్తగూడెం వన్‌టౌన్ ఎస్ఐలు జి.విజయ, తుంగ రాకేష్ వివరాలిల ప్రకారం... మద్యం తాగి వాహనాలు నడుతున్న 9మందికి బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షించగా వారు మద్యం తాగినట్లు రుజువైంది. కొత్తగూడెం ట్రాఫిక్ ఎస్ఐ కే.నరేష్ పర్యవేక్షణలో వాహన తనిఖీ చేస్తుండగా 30మంది మద్యం తాగి వాహనం నడుపుతుండటంతో వారిపై కేసులు నమోదు చేశారు. దీంతో న్యాయాధికారి జరిమానా విధించారు.

మూడు కూపన్లు.. ఆరు ట్రాక్టర్లు!

- గోదావరి, కిన్నెరసాని కేంద్రంగా ఇసుక దందా
- అభివృద్ధి మాటున అక్రమార్కుల చేతివాటం
- బూర్గంపాడు మండలంలో జోరుగా ఇసుక రవాణా
- ట్రాక్టరుకు నెలకు రూ.10వేల మామూళ్లు


ట్రాక్టర్లల్లో ఇసుకను లోడ్ చేస్తున్న దృశ్యం

బూర్గంపాడు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఇసుక దందా అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. భద్రాద్రి జిల్లాలోని గోదావరి, కిన్నెరసాని వంటి నదుల కేంద్రంగా సాగుతున్న ఈ వ్యవహారంలో కొందరు అధికారులు సైతం పాలుపంచుకుంటున్నారు. పగలు, రాత్రి తేడా లేకుండా దర్జాగా ఇసుక అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. బూర్గంపాడు మండల పరిధిలోని కిన్నెరసాని, గోదావరి పరివాహక గ్రామాలైన ఉప్పుసాక, పినపాక పట్టీనగర్, బుడ్డగూడెం, సోంపల్లి, బూర్గంపాడు, సారపాక గ్రామాల్లో ఇసుకు అక్రమ తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి. "అధికారం మనదే.. అధికారులు మనోళ్లే.. మనల్ని అడ్డుకునేది ఎవరు" అన్నట్లు బూర్గంపాడు మండలంలో ఇసుక మాఫియా రెచ్చిపోతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఇసుక దందాపై అధికారులకు సమాచారం అందించినా పట్టించుకునే వారు లేరనే స్థానికుల ఆరోపణలు వెలువడుతున్నాయి.

అభివృద్ధి మాటున అక్రమం

బూర్గంపాడు మండల పరిధిలో రోజు రోజుకు భవన, కర్మాగార నిర్మాణాలు పెరుగుతుండటంతో ఇసుకకు డిమాండ్ పెరిగింది. బూర్గంపాడు మండల పరిధిలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు అధికారులు ఇసుక కూపన్లు జారీ చేశారు. మండలంలోని సోంపల్లి పంచాయతీ పరిధిలోని కిన్నెరసాని వాగు నుంచి ఇసుకను తరలించేందుకు అనుమతులు ఇచ్చినట్లు తెలుస్తోంది. కాగా అభివృద్ధి పనుల మాటున ఈ కూపన్లను అడ్డుపెట్టుకొని వాగులో ఎక్స్‌కవేటర్‌లు పెట్టి నిబంధనలకు విరుద్ధంగా 'మూడు కూపన్లు...ఆరు ట్రాక్టర్లు' అనే చందంగా ఇసుక రవాణాను కొనసాగిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇదిలా ఉండగా సారపాక సమీపంలోని గోదావరి, బూర్గంపాడు, బుడ్డగూడెం, పినపాక పట్టీనగర్ గ్రామాల సమీపంలోని కిన్నెరసాని వాగుల నుంచి రాత్రివేళ అక్రమార్కులు ఇసుకను తరలించేందుకు వక్ర మార్గాన్ని ఎంచుకున్నారు.

ఒక్కో ట్రాక్టరుకు రూ.10వేల మామూలు ?

బూర్గంపాడు మండల పరిధిలో పగలు, రాత్రితేడా లేకుండా జరుగుతున్న ఇసుక అక్రమ రవాణా వ్యవహారాన్ని ఆయా శాఖాల అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన కరువైందని స్థానికులు మండిపడుతున్నారు. ఇసుక అక్రమంపై స్పందించకపోగా అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన అధికారులు అక్రమార్కులకు వత్తాసు పలుకుతూ సమాచారం అందించిన వారి వివరాలను మాఫీయా సభ్యులకు అందిస్తున్నారని పలువురు చెబుతున్నారు. మండల పరిధిలోని ఓఅధికారికి ఇసుక అక్రమ రవాణా చేసే పలువురు ట్రాక్టర్ల యాజమానులు నెలకు ఒక్కో ట్రాక్టరుకు రూ.10వేలు మామూలు చెల్లిస్తున్నట్లు సమాచారం. ఎవరైనా రూ.10వేల కంటే తక్కువ ఇస్తే తనకు వద్దని సదరు అధికారి నిర్మొహమాటంగా చెబుతున్నట్లు తెలుస్తోంది. మీడియా ప్రతినిధుల్లో కొందరు ఇసుక మాఫియాకు, అధికారులకు మధ్య సెటిల్‌మెంట్‌లు చేస్తూ పక్కదారి పట్టిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం

శిరీష, బూర్గంపాడు తహసీల్దార్

తహసీల్దార్‌గా ఇటీవలే బాధ్యతలు చేపట్టాను. పలుశాఖల అధికారులు అభివృద్ధి పనులకు ఇసుక కూపన్లు కావాలంటే జారీ చేశాం. మండలంలో జరుగుతున్న ఇసుక అక్రమ రవాణా విషయం మా దృష్టికి వచ్చింది. ప్రస్తుతం భూభారతి రెవెన్యూ సదస్సుల హడావుడిలో ఉన్నాం. త్వరలోనే ఇసుక అక్రమ రవాణాపై చర్యలు తీసుకుంటాం.

వాటర్ ట్యాంక్ పిల్లర్ పడి కార్మికుడి మృతి

ఖమ్మం ఏఎంసీలో ఘటన



ఖమ్మంమార్కెట్, జూన్3(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో వాటర్ ట్యాంక్ పిల్లర్ మీదపడి వ్యక్తి చనిపోయాడు. ఈ సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. మార్కెట్ ఆధునికీకరణ పనుల్లో భాగంగా అడ్డుగా ఉన్న వాటర్ ట్యాంక్‌ను తొలగిస్తున్నారు. ఈ క్రమంలో సదరు కాంట్రాక్టు కంపెనీలో వర్కర్‌గా పని చేస్తున్న నల్గొండ జిల్లా మిర్యాలగూడేనికి చెందిన తమ్మిశెట్టి చిరంజీవి(45)పై పిల్లర్ పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు.మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని మృతుడి స్వస్థలం మిర్యాలగూడేనికి తరలించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

దుమ్ముగూడెం, జూన్3(ఆంధ్రజ్యోతి): మండల పరిధి రేగుబల్లి సమీప గోదావరి నది ఒడ్డునుంచి ఇసుక అక్రమ రవాణాకు వెళ్లిన నాలుగు ట్రాక్టర్లను పోలీసులు సోమవారం అర్థరాత్రి స్వాధీనం చేసుకున్నారు. వీటిలో ఒక ట్రాక్టరు ఇసుక లోడుతో ఉండగా, మరో మూడు ఇసుకను తరలించే ప్రయత్నంలో దొరికాయి. ఈ ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. పోలీసుల రాకతో మరికొందరు ఇసుకను అన్‌లోడ్ చేసి పారిపోయినట్లు తెలుస్తోంది.

గుండెపోటుతో గ్రామీణ వైద్యుడి మృతి

కామేపల్లి,జూన్3(ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో గ్రామీణ వైద్యుడు మృతి చెందిన సంఘటన కామేపల్లి మండల పరిధిలోని ముచ్చర్లలో మంగళవారం చోటుచేసుకుంది. ముచ్చర్ల గ్రామానికి చెందిన షేక్ ఫారుక్(48) అనారోగ్యానికి గురయ్యాడు. వెంటనే ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించింది. దీంతో హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని స్వగ్రామమైన వైరా మండలంలోని పాలడుగులో అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామీణవైద్యుల సహాయం సంఘం నాయకులు బందెల నాగేశ్వరరావు, మహబూబ్‌రెడ్డి, రాధాక్రిష్ణ, రమేష్, నర్సింహరావు, శ్రీనివాసరావు, రాము నివాళులర్పించారు.

మత సామరస్యానికి పాటుపడాలి

- ఖమ్మం అదనపు డీసీపీ ప్రసాదరావు


మాట్లాడుతున్న ఏడీసీపీ ప్రసాదరావు

ఖమ్మంఖానాపురంహవేలి,జూన్ 3(ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీఒక్కరు పాటుపడాలని, బక్రీదు పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని అడిషనల్ డీసీపీ లాఅండ్ ఆర్డర్ ప్రసాదరావు అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా మంగళవారం నగరంలోని సీక్వెల్‌హాల్‌లో పీస్ కమిటీ సభ్యులతో శాంతి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీసీపీ మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన ఖమ్మం జిల్లాలో ప్రతీఒక్కరు సోదర భావంతో మెలగాలని అన్నారు. త్యాగానికి ప్రతీకగా ముస్లింలు జరుపుకునే బక్రీద్ పండుగకు పోలీస్ అధికారులు అన్ని భద్రతా ఏర్పాట్లు పూర్తి చేశారని, వివిధశాఖలతో సమన్వయం చేసుకోని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో పశువుల అక్రమ రవాణా నివారించటానికి 7 ప్రత్యేక చెక్ పోస్టులు, హోల్డింగ్ పాయింట్స్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాడి ఆవులు, లేగ దూడల క్రయవిక్రయాలు జరపరాదని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పశువుల అక్రమ రవాణా జరిగితే పోలీసులకు సమాచారం అందించాలని చెప్పారు. చట్టాన్ని ఎవరూ తమ చేతుల్లోకి తీసుకోని శాంతిభద్రతలకు విఘాతం కలిగించ వద్దన్నారు. ట్రాఫిక్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, రోడ్లపై ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. మత సామరస్యానికి భంగం కలిగించే విధంగా ఎవరైనా రెచ్చగొట్టే ప్రసంగాలు చేసినా, సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ రమణమూర్తి, సిఐలు కరుణాకర్, బాలకృష్ణ, మోహన్‌బాబు, భానుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిది మందిపై బైండోవర్ కేసుల నమోదు

కరకగూడెం,జూన్3(ఆంధ్రజ్యోతి): మణుగూరు డివిజన్ ఎక్సైజ్ సీఐ రాజిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం చొప్పాల పంచాయతీ లోని పలు గ్రామాలలో ముమ్మరంగా తనిఖీలు చేపట్టారు. డమ్ముల్లో నిల్వ ఉంచిన బెల్లం ఊటను ధ్వంసం చేశారు. సారా తయారు చేసే తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని తహసీల్దార్ కాంతయ్య ఎదుట బైండోవర్ చేశారు. సారా తయారు చేస్తూ మొదటిసారిగా పట్టుపడిన తొమ్మిదిపై బైండోవర్ కేసు నమోదు చేశామని, మరోమారు పట్టుబడితే రూ.లక్ష వరకు ఫైన్‌తో పాటు కేసు నమోదు చేస్తామని ఎక్సైజ్ సీఐ రాజిరెడ్డి తెలిపారు. నగదు కట్టని వారిపై రిమాండ్‌కు తరలిస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో ఎక్కడైనా సారా తయారు చేసినా విక్రయించిన తక్షణమే సమాచారం అందించాలని, వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని సీఐ చెప్పారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్లు శ్రీను, ఆంజనేయులు పాల్గొన్నారు.





సమీక్ష చేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీజ

వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్‌వో కళావతిబాయి

ఖమ్మంకలెక్టరేట్, జూన్3 (ఆంధ్రజ్యోతి): వరదల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాఆరోగ్యశాఖ అధికారి బి కళావతిబాయి అన్నారు. మంగళవారం ఖమ్మం అర్బన్ యూపీహెచ్‌సీ వెంకటేశ్వరనగర్, శ్రీనివాస్‌నగర్‌ను సందర్శించారు. గతఏడాది వరదల కారణంగా పీహెచ్‌సీకి నష్టం వాటిల్లడంతో పాటు ప్రజల సేవలకు అంతరాయం ఏర్పడిందని... ఆఅనుభవంతో ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. సిబ్బంది హాజరును పరిశీలించారు. ఆస్పత్రికి వచ్చిన రోగులతో మాట్లాడారు. ఆశడే సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆశలు, ఏఎన్‌ఎం.లకు రాబోయే వానాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల అవగాహనా కల్పించారు. ప్రతీ మంగళవారం, శుక్రవారం వారానికి రెండురోజులు తప్పక డ్రైడే ప్రజల భాగస్వామింతో నిర్వహించాలన్నారు. డెంగీ పాజిటివ్ కేసును ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యాలు ఎలీసా టెస్ట్ ద్వారా నిర్ధారించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆమె వెంట ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రామారావు, మెడికల్ ఆఫీసర్ శ్రేష్ఠ, యూపీహెచ్‌సీ. కో-ఆర్డినేటర్‌బాబు పాల్గొన్నారు.

భూ భారతితో భూ సమస్యల పరిష్కారం

- కార్పొరేటర్ రావూరి కరుణ
- అల్లీపురంలో గ్రామసభ



మాట్లాడుతున్న కార్పొరేటర్ రావూరి కరుణ

ఖమ్మంసంక్షేమవిభాగం,జూన్3(ఆంధ్రజ్యోతి): భూ భారతి ద్వారా భూసమస్యలు పరిష్కారం జరుగుతున్నాయని కార్పొరేటర్ రావూరి కరుణ పేర్కొన్నారు. మంగళవారం అల్లీపురంలో భూ భారతి గ్రామ సభలు నిర్వహించారు. రైతులు భూ యజమానులు పెద్ద ఎత్తున భూ సమస్యలపై దరఖాస్తులు చేశారు. తహసీల్దార్ కార్యాలయం సూపరింటెండెంట్ బొగ్గవరపు వెంకటేశ్వరరావు, ఆర్ఐ వహిద్, జూనియర్ అసిస్టెంట్ రాజశేఖర్‌రెడ్డి దరఖాస్తులు స్వీకరించారు. రైతులకు అవగాహన కల్పించారు.

వీవీపాలెంలో రెవెన్యూ సదస్సులు

రఘునాథపాలెం:మండలంలోని వీ వెంకటాయపాలెం, కొయచెలక గ్రామాల్లో తహసీల్దారు శ్వేత ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. వీవెంకటాయపాలేం 129, కొయచెలక 65 దరఖాస్తులను ప్రజలు అందించారు. వీ వెంకటాయపాలెంలో గతంలో సర్వేనెంబర్ 101లో ప్రభుత్వ అసైన్డ్ భూమిని ఇళ్ల స్థలాలకు పంపిణీ కాగా వాటిపై ఫిర్యాదులు అధికంగా అందాయి. ప్రశాంతంగా రెవెన్యూ సదస్సులు ముగిశాయి.

భూ సమస్యలను పరిష్కరిస్తాం తహసీల్దార్ రాంప్రసాద్

ఖమ్మంరూరల్: భూభారతి సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రూరల్ తహసీల్దార్ రాంప్రసాద్ తెలిపారు. బారుగూడెం, పల్లెగూడెం గ్రామాల్లో భూ భారతి సదస్సులను మంగళవారం ప్రారంభించారు. భూ సమ్యలపై గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకుంటే వారిని పరిష్కరిస్తామన్నారు. బారుగూడెం గ్రామంలో రైతుల నుంచి 100 దరఖాస్తులు, పల్లెగూడెంలో 100 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీ రవీందర్, ఆర్ఐలు ప్రసాద్, వసంతకుమారి పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికే భూ భారతి

తిరుమలాయపాలెం: గ్రామాల్లో అపరిష్కృతంగా ఉన్న భూసమస్యల పరిష్కారానికే ప్రభుత్వం భూభారతి చట్టం ప్రవేశపెట్టిందని తహసీల్దార్ లూథర్ విల్సన్ తెలిపారు. మంగళవారం మండలంలోని కొక్కిరేణి, సుబ్లేడు తదితర గ్రామాల్లో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈసదస్సుల్లో కొక్కిరేణిలో 85, సుబ్లేడులో 91 రైతులు దరఖాస్తు చేశారు. ఈకార్యక్రమంలో డీటీ జి.సుధీర్, ఆర్ఐలు వీరయ్య లక్ష్మణ్, సిబ్బంది పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తం చేయాలి

- ముంపు, మురికి వాడల్లో ప్రత్యేక దృష్టి సారించాలి
- అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంకలెక్టరేట్, జూన్ 3(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం సీజన్ ప్రారంభం నేపథ్యంలో డెంగీ, మలేరియా లాంటి వ్యాధుల పట్ల అప్రమత్తం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో వైద్య, విద్యా, మహిళాశిశు సంక్షేమ, పంచాయితీ రాజ్‌శాఖ, మునిసిపాలిటీ, రూరల్‌వాటర్ సప్లయ్ అధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. రాబోయే వానాకాలంలో ప్రజలకు అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల్లో ఇప్పటినుండే అవగాహన కల్పించాలన్నారు. వానాకాలంలో వచ్చే ప్రధానమైన సీజనల్ వ్యాధులు మలేరియ, ఫైలేరియా, డెంగీ, చికెన్ గున్యా, మెదడువాపు వ్యాధులపట్ల ప్రజలను అప్రమత్తం చేయాలనీ, ముందస్తుగా అన్ని శాకలు సమన్వయంతో నివారణ చర్యల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈసారి ఖమ్మం జిల్లా ప్రజలను డెంగీవ్యాధి నుండి పూర్తిగా కాపాడడానికి 30 వేల ల్యాబొరేటరీ కిట్లను అదనంగా తెప్పిస్తున్నామని, ప్రతి పీహెచ్‌సీకి 300 కిట్లు సరఫరా చేస్తామని, డెంగీ పట్ల ప్రజల భయాదోళనలును దూరం చేయాలనీ సూచించారు. తిరుమలాయపాలెం, ముస్తఫానగర్ మెడికల్ ఆఫీసర్లు ప్రణాళికలను ఎలా సిద్ధం చేశారని అడిగి తెలుసుకున్నారు. వైద్య ఆరోగ్య శాఖాధికారి బి.కళావతిబాయి, జిల్లా పంచాయితీ అధికారి ఆశాలత, జిల్లా హాస్పటల్స్ సమన్వయ అధికారి రాజశేఖర్, జిల్లా ప్రధానాసుపత్రి సూపరింటెండెంట్ కిరణ్ కుమార్, జిల్లా టీబీ నియంత్రణ అధికారి వరికూటి సుబ్బారావు, ప్రోగ్రాంఅధికారులు పాల్గొన్నారు.

వైద్యసేవలను విస్తృతం చేయాలి

డైరీ ఆవిష్కరణలో డీఎంహెచ్‌వో కళావతిబాయి



డైరీని ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌వో

ఖమ్మంకలెక్టరేట్, జూన్3(ఆంధ్రజ్యోతి): వైద్యులు అంకితభావంతో విధులు నిర్వహించి వైద్యసేవలను విస్తృత పరచాలని జిల్లా వైద్యాధికారి కళావతిబాయి కోరారు. మంగళవారం ఖమ్మం డాక్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రచ్చా శ్రవణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఖమ్మం ఐఎంఏ హాల్లో తెలంగాణ పబ్లిక్ హెల్త్ డాక్టర్స్ అసోసియేషన్ రూపొందించిన డైరీని ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో వైద్య వృత్తికి మంచి గౌరవం ఉందన్నారు. ఎవరైతే సేవా భావంతో పని చేస్తారో వారే ప్రజల గుండెల్లో ఉండిపోతారని అన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు కూడా వైద్యులు సహకారాన్ని అందించాలని సూచించారు. అనంతరం ఆమె డాక్టర్స్ అసోసియేషన్ నేతలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కేంద్ర కమిటీ ప్రెసిడెంట్ డాక్టర్ కత్తి జనార్దన్, సభ్యులు పాల్గొన్నారు. జిల్లా క్షయ నివారణ అధికారి సుబ్బారావు, జిల్లా యూనిట్ ప్రెసిడెంట్ డాక్టర్ రచ్చ శ్రవణ్ కుమార్, జనరల్ సెక్రటరీ డాక్టర్ రమేష్, కోశాధికారి డాక్టర్ ఐ. రత్నమనోహర్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ఆపం: మంత్రి పొంగులేటి



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

నేలకొండపల్లి, జూన్3(ఆంధ్రజ్యోతి): ఎన్ని ఇబ్బందులు ఎదురైనా సంక్షేమ పథకాలను ఆపబోమని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తొలుత ముజ్జుగూడెంలో రూ.16లక్షలతో పునః నిర్మించిన పశువైద్యశాలను ప్రారంభించారు. నేలకొండపల్లి ఎస్సీబీసీ కాలనీలో నిర్మించనున్న అంతర్గత సీసీరోడ్లకు, భైరవునిపల్లి నుంచి నాచేపల్లి వరకు నిర్మించనున్న బీటీరోడ్డుకు, చెన్నారంలో నిర్మించనున్న అంతర్గత సీసీరోడ్లకు మంత్రి శంకుస్థాపన చేశారు. బోదులబండ ఎస్సీ కాలనీ, ముస్లిం బజార్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మంత్రి భూమి పూజ చేశారు. పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను ఇస్తున్నామన్నారు.

నేడు మంత్రి పొంగులేటి పర్యటన

ఖమ్మంరూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పర్యటించనున్నారు. ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని టీసీవీ రెడ్డి ఫంక్షన్ హాల్లో ఇందిరమ్మ ఇళ్లలబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తారు. పోలిశెట్టిగూడెం, తీర్థాల గ్రామాల్లో బీటీరోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు మంత్రి కార్యాలయ ఇన్‌చార్జ్ తుంబూరి దయాకర్ రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

కళాశాల యాజమాన్యం, తల్లిదండ్రుల సహకారంతోనే ర్యాంక్

- అజ్మీరా రోషిక్ మణిదీప్
- జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో ఎస్టీ కేటగిరీలో ఐదో ర్యాంకు



మణిదీప్‌ను అభినందిస్తున్న ప్రసాద్

ఖమ్మంఖానాపురంహవేలి, జూన్2(ఆంధ్రజ్యోతి): సోమవారం ప్రకటించిన జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో నగరంలోని న్యూవిజన్ జూనియర్ కళాశాలకు చెందిన అజ్మీరా.రోషిక్ మణిదీప్ ఎస్టీ కేటగిరీలో 5వ, ఓపెన్ కేటగిరీలో 1353వ ర్యాంక్ సాధించాడు. కళాశాల యాజమాన్యం, తల్లిదతండ్రుల సహకారంతోనే ఈర్యాంక్ సాధించగలిగానని మణిదీప్ చెప్పారు. ఆయన పదోతరగతి న్యూవిన్ పాఠశాలలో చదివాడు.. రానున్న రోజుల్లో ఇంజనీర్‌గా స్థిరపడాలనే లక్ష్యంతోనే ముందుకు చదువు కొనసాగిస్తాను. ఎప్‌సెట్‌లో 311వ ర్యాంక్ సాధించాడు. ఆయన్ను న్యూవిజన్ జూనియర్ కళాశాల అధినేత సీహెచ్. ప్రసాద్ అభినందించారు.

ఇంజనీర్ కావాలన్నదే లక్ష్యం

'హార్వెస్ట్ కళాశాల' విద్యార్థి పేరాల ప్రణవ్



ప్రణవ్

జేఈఈ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో నగరంలోని హార్వెస్ట్ కళాశాల విద్యార్థి పేరాల. ప్రణవ్ ఓపెన్ క్యాటగిరీలో ఆల్ ఇండియా 497వ ర్యాంక్ సాధించాడు. కళాశాల యాజమాన్యం, తల్లితండ్రులు ఇచ్చిన ప్రోత్సాహంతోనే ఈ ర్యాంక్ సాధించానని చెప్పాడు. కళాశాల ఇచ్చిన ప్రణాళికబద్ధమైన శిక్షణతోనే ఈ ర్యాంక్ సాధించగలిగానని, రానున్న రోజులలో కంప్యూటర్ సైన్స్ ఇంజనీర్‌గా స్థిరపడాలని, అందుకు తగ్గట్టుగానే చదువు సాగిస్తాను.

మెప్మా ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్యశిబిరాలు

జిల్లా కో ఆర్డినేటర్ సావల సుజాత

ఖమ్మంసంక్షేమవిభాగం, జూన్3 (ఆంధ్రజ్యోతి): రైజింగ్ తెలంగాణ కార్యక్రమంలో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో మహిళా ఆరోగ్యంపై ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని జిల్లా మిషన్ కోఆర్డినేటర్ సావల సుజాత పేర్కొన్నారు. మంగళవారం కేఎంసీలో హౌజ్ కీపింగ్ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. మహిళా ఉద్యోగుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మెప్మా ఆధ్వర్యంలో త్వరలో రెండు మహిళా ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే ఖమ్మంలోని పాత మున్సిపల్ కార్యలయంలో ప్రతి మంగళవారం మహిళలకు ప్రత్యేకంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించటం జరుగుతుందన్నారు. దీర్ఘకాలిక వ్యాధులకు ప్రత్యేక శిబిరాలు కార్యచరణ చేస్తున్నామన్నారు. మహిళలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పని ప్రదేశంలో ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. టీఎంసీ గుడిపూడి సుజాతరాణి, సీవోలు గొప్పొజు ఉపేంద్ర, బొల్లికొండ రోజా పాల్గొన్నారు.

ఏదులాపురం మునిసిపాలిటీలో 32 వార్డులు

పరిధులు ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ



ఏదులాపురం మునిసిపాలిటీ కార్యాలయం

ఖమ్మంరూరల్, జూన్3(ఆంధ్రజ్యోతి): ఏదులాపురం మునిసిపాలిటీని 32 వార్డులు ఖరారు చేస్తూ అధికారులు మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ మున్సిపాలిటిలో మొత్తం 12 పంచాయతీలను కలిపి ఫిబ్రవరి 6న ఏదులాపురం మునిసిపాలిటీగా ఏర్పాటు చేశారు. నూతన వార్డుల వివరాలను కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ వార్డులో కేటాయింపులో ఏమైనా సవరణలు, సూచనలు చేయదలచుకున్న వారు రేపటి నుంచి 11వ తేదీవరకు మునిసిపాలిటీ కార్యాలయానికి వచ్చి లిఖితపూర్వకంగా తెలపాలని కమిషనర్ ప్రజలకు సూచించారు.

1వ వార్డు

పల్లెగూడెం, రెడ్డిపల్లి, సాయినగర్, వికలాంగుల కాలనీ, భద్రాద్రి కాలనీలను కలుపుతు ఒక వార్డుగా ఏర్పాటు చేశారు. ఈ వార్డులో మొత్తం 1595 ఓట్లు ఉన్నాయి.

2వ వార్డు

రాజీవ్ గృహకల్ప, నాలుగవతరగతి ఉద్యోగుల కాలనీ, సాయికృష్ణనగర్ ఉన్నాయి. ఇందులో 1484 ఓట్లు ఉన్నాయి.

3వ వార్డు

నాయుడుపేట, కరుణగిరి ప్రాంతాలు ఉన్నాయి. ఇందులో 1504 ఓట్లు ఉన్నాయి.

4వ వార్డు

జలగంనగర్, ఆర్టీసీ కాలనీ, 1485 ఓట్లు

5వ వార్డు

పెద్దతండాకాలనీ, కేబిఆర్‌నగర్,ఆర్టీసీ కాలనీలు ఉండగా, ఇందులో 1445 ఓట్లు ఉన్నాయి.

6వ వార్డు

సాయిప్రభాత్ నగర్, టెంపుల్ సిటీ, అభయ టౌన్ షిప్, సింగరేణి కాలనీ, ఇందులో 1592 ఓట్లు ఉన్నాయి.

7వ వార్డు

గుర్రాలపాడు గ్రామం, ఆర్టీసీ కాలనీ, శ్రీవారీనగర్ కాలనీ, సత్యసంకల్ప, షాబాస్ మైసిరెడ్డి నగర్‌లో, వరంగల్ క్రాస్ రోడ్డు, కోదాడక్రాస్ రోడ్డు, గుర్రాలపాడు ప్రాంతాలు ఉన్నాయి. ఇందులో 1375 ఓట్లు ఉన్నాయి.

8వ వార్డు

ఇందిరమ్మ ఫేస్1, కోటనారాయణపురంలో 1374 ఓట్లు..

9వ వార్డు

చిన్న వెంకటగిరి, జంగాల కలనీ, ఏవీఆర్ వెంచర్, ఎస్సీ, బీసీ కాలనీ, ఎన్టీఆర్ విగ్రహం ఏరియాలు ఉన్నాయి. 1331 ఓట్లు ఉన్నాయి.

10వ వార్డు

ఎస్సీకాలనీ,బీసీకాలనీలో1403ఓట్లు ఉన్నాయి.

11వ వార్డు

ఓసీకాలనీ,నంద్యాతండా,బీసీకాలనీ వంజర కాలనీ గుదిమళ్లలో 1432 ఓట్లు ఉన్నాయి.

12వ వార్డు

పెద్దవెంకటగిరి, ఎస్సీబీసీ కాలనీ గ్రామపంచాయతి ఏరియా, చిన్నవెంకటగిరి, గుదిమళ్ల ఎస్.సీ.కాలనీ పార్ట్‌లో 1257 ఓట్లు ఉన్నాయి.

13వ వార్డు

ఇందిరమ్మ ఫేస్2, జిప్లస్1 కాలనీ, ఎస్ఆర్ నగర్, మహలక్ష్మీ వెంచర్, బీవీఆర్. పెట్రోల్ బంక్,వెంకటగిరి క్రాస్‌రోడ్డు ప్రాంతాలు ఉన్నాయి. 1214ఓట్లు ఉన్నాయి.

14వ వార్డు

తెల్దారుపల్లిలోని మహరాజుల కాలనీ, బోళ్లగడ్డ, పాటిమీది తండా, చాకలి బజార్ ఉన్నాయి. 1326 ఓట్లు ఉన్నాయి.

15వ వార్డు

అంజనేయస్వామి గుడి ప్రాంతం, ఎస్సీ, బీసీ కాలనీ లో 1346 ఓట్లు ఉన్నాయి.

16వ వార్డు

లక్ష్మీనగర్,వొడ్డెల్‌కాలనీ,న్యూడబల్‌బెడ్ రూం, తుమ్మలనగర్,మద్దులపల్లిపార్ట్‌లో ప్రాంతాలు ఉన్నాయి. 1389 మంది ఓటర్లు ఉన్నారు.

17వ వార్డు

మద్దులపల్లి పాతగ్రామం, ఇందిరమ్మ కాలనీ, టీకేఆర్ నగర్, మణికంఠ నగర్, లుంబినీ వనం, కోదాడ క్రాస్ రోడ్డు మద్దులపల్లి ఏరియా, వీరాంజనేయ వెంచర్‌లో ప్రాంతాలు ఉన్నాయి. 1347 ఓట్లు ఉన్నాయి.

18వ వార్డు

మద్దులపల్లి పాతగ్రామం, బారుగూడెం, శ్రీ సీటీ, వాయిపుత్రనగర్, 1386 ఓట్లు ఉన్నాయి.

19వ వార్డు

19వ వార్డు, గొల్లగూడెం, డబుల్‌బెడ్‌రూరం, శ్రీ సీటీ 7,8,9 రోడ్లు, వెంకటాద్రి టౌన్‌షిప్‌లో, నందనవనం గొల్లగూడెం ప్రాంతాలు ఉన్నాయి. 1300 ఓట్లు ఉన్నాయి.

20వ వార్డు

బోడ్రాయి సెంటర్, సావిటి సెంటర్, ఎస్సీ కాలనీ, బీసీ కాలనీ, బాలమ్మ చింత బజార్ ప్రాంతాలు ఉన్నాయి. 1319 ఓట్లు ఉన్నాయి.

21వ వార్డు

నిమ్మతోట బజార్, ఎస్‌వీఆర్ నగర్, బోరింగ్ బజార్, హైస్కూల్ బజార్, అంజనేయస్వామి గుడి, బడుల్‌బెడ్ రూం ముత్తగూడెం,ఎస్‌వీఆర్ నగర్ గోకులం టౌన్‌షిప్, కచీర్ల బండ ప్రాంతాలు ఉన్నాయి. 1258 ఓట్లు ఉన్నాయి.

22వ వార్డు

టీఎన్జీవో కాలనీ, సాయిగణేష్ నగర్, సప్తగిరి నగర్ ప్రాంతాలు ఉన్నాయి. 1497 ఓట్లు..

23వ వార్డు

గాయత్రీనగర్, సత్యనారాయణపురం, సాయి నగర్, ఇందిరమ్మకాలనీ, రాఘవేంద్రనగర్ రాజీవ్‌నగర్‌లో... 1510 ఓట్లు ఉన్నాయి.

24వ వార్డు

సూర్యానగర్, చంద్రానగర్, తాళ్ళేసితండా, చిన్నతండా, కేఎల్ఆర్ బృందావనమ్, గోకుల కృష్ణనగర్, ఆదిత్య టౌన్‌షిప్, నందనవనం ఏదులాపురం ప్రాంతాలు ఉన్నాయి.. 1358 ఓట్లు.

25వ వార్డు

టీచ్చర్స్‌కాలనీ, నడిమితండా,లెక్చరర్స్ కాలనీ ప్రాంతాలు ఉండగా, 1492 ఓట్లు ఉన్నాయి.

26వ వార్డు

పెద్దతండా జీపీరోడ్డు,టీచ్చర్స్ కాలనీలో 1438 ఓట్లు ఉన్నాయి.

27వ వార్డు

ఆర్ఎస్ నగర్, లక్ష్మీబృందావనం, పెద్దతండాలో 1482 ఓట్లు ఉన్నాయి.

28వ వార్డు

షాబాదునగర్, నారపొంగు బజార్, హచ్ ఎన్ బజార్, శ్రీరాంనగర్, మారుతినగర్ రోడ్డు7,8,9, చైతన్య నగర్ ప్రాంతాలు ఉన్నియి. 1366 ఓట్లు ఉన్నాయి.

29వ వార్డు

రైస్‌మిల్లు ఏరియా,వెంకటసుదానగర్, మారుతినగర్,శ్రీరాంనగర్‌పార్ట్2లో1333ఓట్లు ఉన్నాయి.

30వ వార్డు

ఆటోనగర్ కాలనీ, డీబీఆర్‌నగర్, సాయి బృందావనం కాలనీ, పోన్నేకల్లు డొంక, కొప్పుల బద్రయ్యనగర్‌లో 1285 ఓట్లు ఉన్నాయి.

31వ వార్డు

ఏదులాపురం ఎస్సీకాలనీ, బీసీకాలనీ, (వాటర్‌ట్యాంక్ ఏరియా) ఆదిత్యనగర్‌లో 1430 ఓట్లు..

32వ వార్డు

ఏదులాపురం బీసీ కాలనీ(గ్రామపంచాయతీ ఏరియా)వెంపటినగర్, ఓరుగంటి నగర్, సింహాద్రినగర్‌లో 1297 ఓట్లు ఉన్నాయి.



సైకిల్‌యాత్రకు స్వాగతం పలుకుతున్న మండల కార్యదర్శి

మార్పు దిశగా యువత పయనించాలి

మంచుకొండలో డీవైఎఫ్ఐ సైకిల్‌యాత్రకు భారీ స్వాగతం

రఘునాథపాలెం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): నేటియువతే రేపటి సమాజ నిర్దేతలని సీపీఎం మండల కార్యదర్శి ఎస్.నవీన్‌రెడ్డి పేర్కొన్నారు. డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో చేపట్టిన యువచైతన్య సైకిల్‌యాత్ర మంగళవారం మంచుకొండకు చేరింది. సీపీఎంతో పాటుగా అనుబంధ సంఘాల నాయకులు ఘన స్వాగత పలికారు.యువత చెడు వ్యసనాలకు బానిస కాకుండా ప్రజలను మంచి విషయాలపై చైతన్య పర్చాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్, మత్తు పదార్థాలకు గురి కావొద్దని హితవు పలికారు. నాయకులు బహిరుద్దీన్, చింతల రమేశ్, మద్దాల ప్రభాకర్, శీలం వీరబాబు, సత్తనపల్లి నరేశ్, గుమ్మ ముత్తారం, కొట్టు మధు, కూచిపూడి నరేశ్,ఇమామ్,వల్లూరు శ్రీను,కన్నగంటితిరపయ్య పాల్గొన్నారు.



రైతులకు విత్తనాలు అందజేస్తున్న చైర్మన్ హరినాథబాబు

నాణ్యమైన విత్తనాలతోనే అధిక దిగుబడి

మద్దులపల్లి మార్కెట్ చైర్మన్ హరినాథబాబు

ఖమ్మంరూరల్,జూన్3(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విత్తనాల ద్వారానే అధిక దిగుబడులు సాధించవచ్చునని మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ బైరు హరినాథబాబు తెలిపారు. మండల పరిధిలోని పోన్నేకల్లు రైతు వేదికలో మంగళవారం నాణ్యమైన విత్తనం-రైతన్నకునేస్తం కార్యక్రమంలో భాగంగా జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు సరఫరా చేసిన విత్తనాల సంచులను రైతులకు అందజేశారు. పంటకాలంలో వ్యవసాయ శాస్త్రవేత్తలు కూడా సందర్శిస్తారని ఏడీఏ సరిత తెలిపారు. రూరల్ మండలంలో సిద్ధి, ఎమ్‌జీజీ-385 వరి రకాన్ని కూడా రైతులకు అందజేస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో పాలేరు ఆత్మకమిటి డైరెక్టర్లు మురళి, రంగారావు, మహేష్, ఏఓ ఉమా నగేష్, ఏఈవోలు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న మేయర్ నీరజ, కమిషనర్ అభిషేక్

డివిజన్లలో ప్రత్యేక పారిశుధ్య పనులు

ఖమ్మంసంక్షేమవిభాగం, జూన్3 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 13, 21, 50 డివిజన్‌ల్లో వందరోజులు కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక పారిశుధ్య పనులను మంగళవారం మేయర్ పునుకొల్లు నీరజ, కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రారంభించారు. ప్రజలు విన్నవించిన సమస్యలపై వెంటనే స్పందించారు. కార్పొరేటర్లు కొత్తపల్లి నీరజ, రాపర్తి శరత్‌కుమార్, ఆళ్ల నిరీషా, అసిస్టెంట్ కమిషనర్ ఆహ్మద్ షఫీఉల్లా, పట్టణ ప్రణాళిక అధికారి గంధం వసుందర, ఉద్యాన అధికారి బెల్లం రాధిక, పారిశుధ్య సూపర్‌వైజర్ సాంబయ్య పాల్గొన్నారు.13వ డివిజన్‌లో స్వల్పవివాదం చోటు చేసుకొంది. తన నివాసం చుట్టూ డ్రెయినేజీలు శుభ్రం చేయటం లేదని ఇద్దరు స్థానిక కార్పొరేటర్, మేయర్, కమిషనర్‌ను ప్రశ్నించారు. స్పందించిన అధికారులు ర్యాంపును కట్‌చేసి డ్రెయినేజీని వ్యవస్థను శుభ్రం చేశారు.



పిండిప్రోలులో అవగాహన కలిపిస్తున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించాలి

పిండిప్రోలు జడ్పీఎస్ఎస్ హెచ్ఎం జ్యోతి

తిరుమలాయపాలెం, జూన్3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో బడి ఈడు పిల్లలను చేర్పించాలని పిండిప్రోలు జడ్పీఎస్ఎస్ హెచ్ఎం ఎన్‌వీఎన్ జ్యోతి తెలిపారు. మంగళవారం మండలంలోని బీసరాసిపల్లి, బలరాం తండా, వెదుళ్లచెరువు, తిరుమలాయపాలెంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వపాఠశాలల ఉపయోగాలు వివరించారు. పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో చేర్పిస్తే వేలాది రూపాయలుఖర్చవుతాయని, ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం, తదితర వాటిని అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తులసి, లలితకుమారి పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి
● మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
● వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు , జూలూరుపాడు
● సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి
ZONE
బుధవారం 4 జూన్ 2025
వైరా-మధిర
సత్తుపల్లి
WYRA, MADHIRA, SATHUPALLY

పశువుల అక్రమ రవాణా చేపడితే చర్యలు: సీఐ


వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

ముదిగొండ, మే 3 (ఆంధ్రజ్యోతి): పశువుల అక్రమ రవాణా చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ మురళీ హెచ్చరించారు. మంగళవారం సీఐ మురళీ ఆదేశానుసారం వల్లభి అంతర్రాష్ట్ర చెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి వచ్చే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ అనంతరాములు, ట్రైనీ ఆర్ఎస్ఐ శ్రీకాంత్, ఏఎస్ఐ సాంబశివరావు, సిబ్బంది పాల్గొన్నారు.

భూ భారతితో సమస్యలకు పరిష్కారం


బత్తులపల్లిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఆర్డీవో

కల్లూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పలు మండలాల్లోని గ్రామాల్లో మంగళవారం భూ భారతి గ్రామ సభలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కల్లూరు, వేంసూరు మండలాల పరిధిలోని బత్తులపల్లి, ముచ్చవరం, చౌడవరం గ్రామాల్లో జరిగిన గ్రామ సభల్లో ఆర్డీవో ఎల్. రాజేందర్‌గౌడ్ పాల్గొని భూ భారతి చట్టం ప్రాముఖ్యత గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సాంబశివుడు, ఏఎంసి ఛైర్మన్ బాగం నీరజదేవి, డిప్యూటీ తహసీల్దార్ బాబ్జీప్రసాద్ పాల్గొన్నారు.

కల్లూరు డివిజన్ పరిధిలో గల ఆరు మండలాల పరిధిలో మంగళవారం తొలి రోజున జరిగిన భూ భారతి గ్రామ సభల్లో రైతులు తమ భూ సమస్యలను వివరిస్తూ దరఖాస్తులను వెల్లువలా అందించారు. సత్తుపల్లి మండలంలో కిష్టారంలో 42, రేగళ్లపాడులో 73, ఏన్కూరు మండలంలో ఏ న్కూరు 20, జన్నారం 191, కల్లూరు మండలం ముచ్చవరంలో 149, బత్తులపల్లిలో 154 దరఖాస్తులు అందగా, పెనుబల్లి మండలంలో చౌడారం, కుప్పెనకుంట్లలో కలిపి 87, తల్లాడ, మండలంలో 353, వేంసూరు మండలంలో దుద్దేపూడి, కల్లూరుగూడెం, కలిపి 143 దరఖాస్తులు అందించారు.

సత్తుపల్లిలో...

సత్తుపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం-2025 గ్రామ సభలను సత్తుపల్లి మండలంలో మంగళవారం ప్రారంభించారు. సత్తుపల్లి మండలం రేగళ్లపాడు, కిష్టారం గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. వ్యవసాయ భూములు స్వాధీనంలో ఉండి పాస్‌పుస్తకాలు అందని 75 మంది రైతులు రేగళ్లపాడులోనూ, కిష్టారం పంచాయతీలో 42 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు. గ్రామ సభల్లో నాయబ్ తహసీల్దార్ శివ, గిర్దావర్ జానీమియా, సిబ్బంది పాల్గొన్నారు.

కొణిజర్లలో ...

కొణిజర్ల, జూన్3(ఆంధ్రజ్యోతి): ప్రతి దరఖాస్తును పరిశీలించి సత్వరం పరిష్కరిస్తామని తహసీల్దార్ రాము రైతులకు వివరించారు. మంగళవారం మండలంలోని తనికెళ్ళ, అమ్మపాలెం గ్రామాలలో రెవెన్యూ సదస్సులను ప్రారంభించారు. తనికెళ్ళలో భూ సమస్యలపై 219 దరఖాస్తులు, అమ్మపాలెంలో 96 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. ఈ సదస్సుల్లో ఆర్ఐలు రమేష్, అశోక్, పాల్గొన్నారు.

94 సాదాబైనామాల దరఖాస్తులు

వైరా, మే 3 (ఆంధ్రజ్యోతి): వైరా మండలంలో మంగళవారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్వగ్రామమైన స్నానాల లక్ష్మీపురం, గన్నవరం గ్రామాల్లో భూభారతి సదస్సులను మొదటిరోజు నిర్వహించారు. వైరా తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు నేతృత్వంలో స్నానాల లక్ష్మీపురంలో, నాయబ్ తహసీల్దార్ సీహెచ్.సురేష్ ఆధ్వర్యంలో గన్నవరం గ్రామంలో ఈ భూరభారతి సదస్సులు జరిగాయి. ఈ రెండు గ్రామాల్లో 134దరఖాస్తులను రైతులు భూభారతి సదస్సుల్లో అందజేశారు. వీటిలో ఏకంగా 94దరఖాస్తులు సాదాబైనామాలకు సంబంధించినవే ఉన్నాయి. స్నానాల లక్ష్మీపురంలో 31 దరఖాస్తుల్లో 19దరఖాస్తులు సాదాబైనామాకు చెందినవి కాగా, గన్నవరంలో 103దరఖాస్తుల్లో 75దరఖాస్తులు సాదాబైనామా కింద రైతులు అందజేశారు. గిర్దావర్‌లు రాజావిక్రమ్, శ్రీకాంత్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కారేపల్లిలో...

కారేపల్లి, జూన్3(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం భూ భారతి రెవెన్యూ సదస్సులు ప్రారంభమయ్యాయి. తహసీల్దార్ సంపత్‌కుమార్ మాట్లాడుతూ సదస్సులు ఈనెల18వరకు కొనసాగుతాయన్నారు.

ముదిగొండలో 103దరఖాస్తులు

ముదిగొండ, మే 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మపేట, ఎడవల్లి, ఎడవల్లి లక్ష్మీపురం గ్రామాల్లో మంగళవారం భూభారతి రెవెన్యూ సదస్సులు జరిగాయి. ఆయా గ్రామపంచాయతీల్లో సదస్సుల్లో రైతులు తమ భూములకు సంబంధించి సమస్యలపై 103 దరఖాస్తులను తహసీల్దార్ సునీత ఎల్లిబెత్, నాయబ్ తహసీల్దార్ లక్ష్మీలకు అందజేశారు.


ముదిగొండలో...

ఈనెల 17వతేదీ వరకు రెవెన్యూ సదస్సుల ద్వారా భూసమస్యలపై దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో గిర్దావర్‌లు వహీదాసుల్తానా, ప్రసన్నకుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మధిర మండలంలో 63 దరఖాస్తులు

మధిరరూరల్, జూన్3(ఆంధ్రజ్యోతి): మధిర మండలంలో మంగళవారం జాలిముడి, మల్లారం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ రాంబాబుతోపాటు పలు అధికారులు హాజరయ్యారు. మల్లారం గ్రామంలో మొత్తం 54దరఖాస్తులు, జాలిముడి నుంచి 9 దరఖాస్తులు వచ్చాయి.

ఏన్కూరులో 211 దరఖాస్తులు

ఏన్కూరు, జూన్3(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన భూభారతి సదస్సులు మంగళవారం ఏన్కూరు, జన్నారం గ్రామాల్లో ప్రారంభమాయ్యయి. ఏన్కూరులో 20, జన్నారంలో 191, మొత్తం 211 దరఖాస్తుల వచ్చాయి. ఈసదస్సులను తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు, డీటీ కిరణ్ ప్రారంభించారు. ఈకార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


వైరాలో....


సత్తుపల్లిలో మాట్లాడుతున్న నాయబ్ తహసీల్దార్ శివ


కొణిజర్లలో...


మధిరరూరల్‌లో...


వెంకట్రామిరెడ్డి దంపతులను సన్మానిస్తున్న మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

హౌజింగ్ రిటైర్డ్ ఉద్యోగికి మంత్రి పొంగులేటి సన్మానం

వైరా, మే 3 (ఆంధ్రజ్యోతి): వైరాలో గృహనిర్మాణశాఖ విశ్రాంత అసిస్టెంట్ ఇంజనీర్ బొగ్గుల వెంకట్రామిరెడ్డి, పద్మావతి దంపతులను రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సన్మానించారు. ఎర్రుపాలెం మండల పర్యటన ముగించుకొని తిరుగు ప్రయాణంలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌తో కలిసి విశ్రాంత ఏఈ వెంకట్రామిరెడ్డి ఇంటికి మంత్రి పొంగులేటి వెళ్లారు. రాష్ట్ర గృహనిర్మాణసంస్థ అసిస్టెంట్ ఇంజనీర్, వర్క్ఇన్‌స్పెక్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, సూర్యాపేట ఏఈగా పనిచేస్తున్న వెంకట్రామిరెడ్డి గతనెల 31న ఉద్యోగవిరమణ చేశారు. ఎమ్మెల్యేతో కలిసి మంత్రి పొంగులేటి వెంకట్రామిరెడ్డి దంపతులను సన్మానించిన జ్ఞాపికను అందజేశారు. వారి వెంట రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, నూతకాని జైపాల్, దార్న రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

పలువురికి పరామర్శ

మధిరరూరల్, జూన్3(ఆంధ్రజ్యోతి): మధిరమండలం వంగవీడు, ఆత్కూరు గ్రామాల్లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం పర్యటించారు. వంగవీడులో ఇటీవల అస్వస్థతకు గురైన మాజీ ఎంపీటీసీ అయలూరిజనార్ధన్ రెడ్డిని, పరామర్శించారు. ఆత్కూరు గ్రామంలో ఇటీవల మృతి చెందిన మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు దారా బాలరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు కోటా రాంబాబు, అయిలూరు వెంకటేశ్వరరెడ్డి, నాయకులు సూరంశెట్టి కిషోర్, కర్నాటి రామారావు, యన్నం కోటేశ్వరరావు, అయిలూరు సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యోగాపై అవగాహన ర్యాలీ

తల్లాడ,జూన్3(ఆంధ్రజ్యోతి): తల్లాడలో మంగళవారం యోగా అవగాహన ర్యాలీని ర్వహించారు. ఈసందర్భంగా హోమియోపతి వైద్యాధికారి నీలిమ మాట్లాడుతూ ఆరోగ్యమే మహభాగ్యమన్నారు. ఆ ఆరోగ్యాన్ని యోగా ద్వారా మెరుగుపరుచుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో మండల వైద్యాధికారి రత్నమనోహర్, పల్లె దవాఖాన వైద్యులు విజయ్‌చందర్, నీష్మ, సీహెచ్‌వో భాస్కర్, సూపర్‌వైజర్లు కె.పెద్దపుల్లయ్య, భద్రమ్మ, ఝాన్సీ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన


విద్యార్థి జశ్వితను అభినందిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

ఏన్కూరు, జూన్3(ఆంధ్రజ్యోతి): హైదరాబాదు బోయినపల్లి వాటర్‌స్పోర్ట్స్ స్కూల్‌లో 5వతరగతి ప్రవేశపరీక్షల్లో ఏన్కూరు మండలం తిమ్మరావుపేట ఓం ఆదిత్య గాయత్రి పాఠశాల విద్యార్థిని భూక్యా జశ్విత ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి మూడో ర్యాంకు సాధించింది. ఈసందర్భంగా జశ్వితను క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ అభినందించారు. పాఠశాల ప్రిన్సిపాల్ దాసరి రమేష్‌ను అభినందించారు.

పూర్వ విద్యార్థుల సాయం

తల్లాడ, జూన్3(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల 1988-89 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు మిత్రుడి కుటుంబానికి మంళవారం రూ.20 వేలు ఆర్థికసాయం అందించారు. తనతోపాటు చదువుకున్న తొర్లపాటి సంతోష్ భార్య రెండేళ్ల క్రితం మృతి చెందగా, అతని కుమార్తె 9వతరగతి చదువుతున్న వర్షిణీ పేరుతో రూ.20వేలు ఎస్‌బీఐ బ్యాంకులో డిపాజిట్ చేశారు. ఎస్‌బీఐ మేనేజర్ ఫణికుమార్ చేతులమీదుగా డిపాజిట్ పత్రాలను పూర్వ విద్యార్థులు అందించారు ఈకార్యక్రమంలో దగ్గుల కరుణాకరరెడ్డి, గుడిపల్లి నారాయణ, కోపెల అప్పారావు, నంబూరు శ్రీనివాసరావు, మేడి శ్రీనివాసరవు, బండారు జనార్ధన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

కారేపల్లి, జూన్3(ఆంధ్రజ్యోతి): మండలంలో అర్హులైన ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు మంగళవారం ఇంటి పట్టాలను పంపిణీ చేశారు. మంజూరైన వారికి పంచాయతీ కార్యదర్శులు స్వయంగాపంపిణీ చేశారు. ఈసందర్భంగా మండల కాంగ్రెస్ నాయకుడు అడ్డగోడ అయిలయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులైన పేదవారిని గుర్తించి ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసిందన్నారు.

చింతకానిలో డిప్యూటీ సీఎం భట్టి పర్యటన


చింతకాని గ్రామస్థులతో మాట్లాడుతున్న భట్టి

చింతకాని, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హైదరాబాద్ తిరుగుప్రయాణంలో మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామంలో మండల నాయకులతో సమావేశమయ్యారు. సందర్భంగా మండలంలోని అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. స్థానిక నాయకులు, ప్రజలు ఇచ్చిన వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో అంబటి వెంకటేశ్వర్లు, బందెల నాగార్జున, తోటకూరి ప్రగతి, హరీష్, మండెపూడి కిషన్‌రావు పాల్గొన్నారు.

తొలి తరం తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలని వినతి

మధిరటౌన్, జూన్3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం 1969 లో పోరాడిన తొలి తరం తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలని ఆనాడు పోరాటం లో పాల్గొన్న పలువురు ఉద్యమకారులు ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను కలిసి విజ్ఞప్తి చేశారు. మంగళవారం మధిరలోని డిప్యూటీ సీఎం కార్యాలయంలో భట్టిని కలిసి తమన ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పుతుంబాక కృష్ణప్రసాద్, బాబ్లా, ఎలగందుల రాధాకృష్ణ, బాహటం సుబ్బరాజు, మల్నీడు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో వైరా విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన చిన్నారులు

వైరా, మే 3 (ఆంధ్రజ్యోతి): నేషనల్ ఓపెన్ కరాటే టోర్నమెంట్‌లో పలువురు చిన్నారులు మెడల్స్ సాధించి తమ ప్రతిభను చాటుకున్నారు. అబిస్కో కరాటే అసోసియేషన్ కరాటే మాస్టర్ రఘు ఆధ్వర్యంలో శిక్షణ పొందిన చిన్నారులు మెడల్స్ సాధించారు. హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో జరిగిన నేషనల్ ఓపెన్ కరాటే టోర్నమెంట్‌లో చిన్నారులు ఒక గోల్డ్, మూడు సిల్వర్ మెడల్స్, తొమ్మిది బ్రౌన్ మెడల్స్‌ను సాధించారు. మంగళవారం వైరాలో నిర్వహించిన ఒక కార్యక్రమంలో మెడల్స్ సాధించిన చిన్నారులు అలాగే కరాటే మాస్టర్స్ రఘు, గోపిలను వైరా మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ ముళ్లపాటి సీతరాములు అభినందించి సన్మానించారు.

యువత మంచి మార్గంలో నడవాలి

కారేపలి, జూన్ 3(ఆంధ్రజ్యోతి): చేదువ్యసనాల వైపు ప్రయాణిస్తున్న యువతను మంచి మార్గం వైపు నడిపించేందుకే డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో యువ చైతన్య సైకిల్‌యాత్ర నిర్వహిస్తున్నట్లు జిల్లా సీపీఎం నాయకులు కొండెబొయిన నాగేశ్వరరావు అన్నారు. జిల్లా యాత్రలో భాగంగా మంగళవారం మండలంలో పలు గ్రామ పంచాయతీలలో కొనసాగింది. సైకిల్‌యాత్రకు పలు యవజన సంఘలు మద్దతు పలికాయి.

భట్టి ఆదేశాలతో బస్ సర్వీస్ ప్రారంభం

చింతకాని, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సోమవారం మండల కేంద్రంలో పర్యటించిన సందర్భంగా స్థానిక ప్రజలు బస్సు సౌకర్యం కల్పించాలని విన్నవించడంతో ఆయన ఆదేశాల మేరకు చింతకాని మండల కేంద్రం నుంచి ఖమ్మానికి బస్సు సౌకర్యాన్ని మంగళవారం ఆర్‌టీసీ డీఎం దినేష్ పునఃప్రారంభించారు. మండల ప్రజలు బస్సు సౌకర్యాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరా రు. కార్యక్రమంలో తహసీల్దార్ కూరపాటి అనంతరాజు, ఎస్ఐ నాగుల్‌మీరా, మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు, కన్నెబోయి న గోపి, మడిపల్లి భాస్కర్, కొప్పుల గోవిందరావు, బందెల నాగార్జున, కంచుమర్తి రామకృష్ణ, ఆలస్యం శంకర్‌రావు, పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలతో అధిక దిగుబడులు

చింతకాని, జూన్ 3(ఆంధ్రజ్యోతి): విత్తనాల ఎంపికలో రైతులు జాగ్రత్తలు వహించాలని రైతు శిక్షణ కేంద్రం జేడీ. అభిమన్యుడు సూచించారు. మంగళవారం మండల పరిధిలోని బస్వాపురం గ్రామంలో నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు విత్తనాలను అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు సతీష్, ఇంటూరి భాస్కర్‌రావు, నవీన్, ఏవో సోములపల్లి మానస, ఏఈవోలు ఆయేషా, తేజ, తాహీయా, కార్తీక్, రాము, కళ్యాణి పాల్గొన్నారు.


ఏన్కూరులో...

తల్లాడ, జూన్3(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విత్తనం రైతన్నకు నేస్తమని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ అన్నారు. మంగళవారం తల్లాడ రైతువేదికలో వ్యవసాయశాఖ, వ్యవసాయ యూనివర్శిటీ చేపట్టిన విత్తుకొద్దీపంట కార్యక్రమం నిర్వహించారు ఈసందర్భంగా రైతులకు వరి విత్తనాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఏవో ఎండీ తాజుద్దీన్ పాల్గొన్నారు.

పెనుబల్లి, మే 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, పెనుబల్లి మండల వ్యవసాయశాఖల సంయుక్త ఆధ్వర్యంలో వరి విత్తనాలను మంగళవారం రైతులకు పంపిణీ చేశారు. కల్లూరు ఏఎంసీ వైస్‌చైర్మన్ రాచబంటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో డబ్ల్యూజీఎల్-44 వరి విత్తనాల మినీకిట్టుతోపాటు ఎంజీజీ-385మినీ కిట్‌ను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో ఏవో ప్రసాదరాజు, రైతులు పంది వెంకటేశ్వరరావు, చీకటి రామారావు, మాలోతు రాధాకృష్ణ, గోగినేని రమేష్,


తల్లాడలో విత్తనాలు పంపిణీ చేస్తున్న రవికుమార్

మోరంపూడి బాబూరావు, ఏఈవోలు నరేష్, లక్ష్మీభవాని, నాగరాజు, షర్మిల, ఎన్‌స్వీ.సమంత, హర్షనందిని, డీహెచ్‌వో బుచ్చిబాబు పాల్గొన్నారు.

ఏన్కూరు, జూన్3(ఆంధ్రజ్యోతి): అగ్రికల్చర్ యూనివర్శిటీ ప్రత్యేకంగా తయారుచేసిన వరి విత్తనాలను ఏవో నరసింహారావు రైతులకు పంపిణీ చేశారు. మంగళవారం నాచారం రైతువేదికలో విత్తుకొద్ది పంట అనే కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఏఈవోలు కమలాకర్, లహరి, బాలకృష్ణ, శ్రీకాంత్, నవ్య, భవ్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నూతన వ్యవసాయ చట్టాలను రద్దు చేయాలి

» మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య

కారేపల్లి, జూన్3(ఆంధ్రజ్యోతి): నూతన వ్యవసాయ చట్టాలను వెంటనే రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య అన్నారు. మంగళవారం మండల పరిధిలోని టేకులగూడెంలో అఖిలభారత ఐక్యరైతు సంఘం ఖమ్మం డివిజన్ మహ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. వ్యవసాయ సీజన్‌కు ఒకనెలముందు ప్రారంభం కావడంతో రైతులకు కావాల్సిన అన్నిరకాల ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలన్నారు. నాణ్యమైన ఎరువులు విత్తనాలు అందుబాటులో ఉంచి రైతులను అదుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గుమ్మడి నర్సయ్య

బైకుపై ఉపాధ్యాయుడి 'బడిబాట' యాత్ర

కల్లూరు, జూన్3 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు స్వచ్ఛందంగా తలపెట్టిన బడి బాట బైక్ యాత్రను అడిషనల్ కలెక్టర్ శ్రీజ, డీఈవో సత్యనారాయణలు మంగళవారం ప్రారంభించారు. మండల పరిధిలోని చెన్నూరు ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న దంతాల సుధాకర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల ప్రవేశం పెంచేలా స్వచ్ఛందంగా బైక్ యాత్రను చేపట్టారు. మైక్‌తో, కరపత్రాల ద్వారా తన ప్రచారాన్ని ఇలా గ్రామాల్లో తిరుగతూ తల్లిదండ్రులను కలుసుకొని, ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న వసతి సౌకర్యాల కల్పనపై వివరిస్తూ తన బైక్ యాత్ర ద్వారా ప్రజలకు అవగాహనకు కల్పిచేలా శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఉపాధ్యాయుడు సుధాకర్ చేపట్టిన బైక్‌యాత్రను అభిందించారు. పిల్లలను మీ ఊరి ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో నివేదిత, పీఆర్టీయూ అధ్యక్షుడు పాకాల రమేష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


బడిబాట ప్రచార యాత్రను ప్రారంభిస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్రీజ, డీఈవో సత్యనారాయణ

జగ్గయ్యపేట ఎమ్మెల్యేను కలిసిన చందర్‌రావు


జగ్గయ్యపేట ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రికను అందిస్తున్న చందర్‌రావు

కల్లూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) ఏపీలోని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య)ను మంగళవారం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు పసుమర్తి చందర్‌రావు మర్యాద పూర్వకంగా కలిశారు. తన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆహ్వానించారు. కల్లూరులో ఈ నెల 8న జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు చందర్‌రావుతో పాటుగా అనుబంధ సంఘాల ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరగనున్నది. ఈ సందర్భంగా ప్రమాణ స్వీకార కార్యక్రమానికి జగ్గయ్యపేట ఎమ్మెల్యే గోపాలరావును విశిష్ట అతిథిగా రావలసిందిగా ఆయనను జగ్గయ్యపేటలో కలిసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘ పొలిటికల్ చైర్మన్ రంగా హనుమంతరావు, ప్రచార కార్యదర్శి కె బలరాం, సంఘ నాయకులు పసుమర్తి రాంబాబు, పసుమర్తి వెంకటేశ్వరరావు, దోసపాటి శ్రీనువాసరావు, ఎస్ పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ సేవా సంఘం కమిటీ ఎన్నిక


నూతన కార్యవర్గాన్ని సన్మానిస్తున్న సభ్యులు

తల్లాడ,జూన్3(ఆంధ్రజ్యోతి): నాయీబ్రాహ్మణ సేవా సంఘం తల్లాడ పట్టణ అధ్యక్షుడిగా రాచమల్ల పెద్దబ్బాయి ఎన్నికయ్యారు. మంగళవారం తల్లాడలో జిల్లా కన్వీనర్ నంద్యాల నర్సింహారావు ఆధ్వర్యంలో సేవా సంఘం తల్లాడ పట్టణ మండల కమిటీల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. పట్టణ ప్రధాన కార్యదర్శిగా రాచమల్లశివ, ఉపాధ్యక్షుడుగా రాచమల్లఅప్పారావు, మండల కమిటీ అధ్యక్షుడుగా రాచమల్ల వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా ఉప్పెర్ల రామారావు, ఉపాధ్యక్షుడుగా కన్నదేవర కృష్ణ ఎన్నికయ్యారు ఈకార్యక్రమంలో జిల్లానాయకులు వైజగదీష్, నంద్యాలరాము పాల్గొన్నారు.